
తిరుమల తిరుపతి దేవస్థానములు

సప్తగిరి

సచిత్రమాసపత్రిక

జూన్ 2015, వెల రూ.5/-



ముత్యాల కవచ సమర్పణం
02-06-2015

వజ్రకవచ సమర్పణం
01-06-2015

శ్రీవారి జ్యేష్ఠాభిషేకం, తిరుమల
01-06-2015 నుండి 03-06-2015 వరకు

స్వర్ణ కవచ సమర్పణం
03-06-2015

తిరుమల
శ్రీవారి ఆలయంలో
"ఉగాది" సందర్భంగా
ఫల, పుష్ప అలంకారం






"శ్రీరామనవమి" సందర్భంగా
తిరుమల శ్రీవారి ఆలయంలో
శ్రీకోదండరామస్వామి వారికి ప్రత్యేక పూజలు







ఎంత విభవము గలిగె - నంతయును నాపదని
చింతించినది గదా - చెడని జీవనము.

చలముఁ గోపంబుఁ దనుఁ - జంపేటి పగతులని
తెలిసినది యదిగదా - తెలివి,
తలకొన్న పరనింద - తనపాలి మృత్యువని
తొలఁగినది యదిగదా - తుదగన్న ఫలము.

ఎనలేని తిరువేంక - టేశుఁడే దైవమని
విన గలిగినదిగదా - వినికి,
అనయంబు నతని సే - వానందపరులయి
మనఁ గలిగినది గదా - మనుజులకు మనికి.
(1-181)

సంపద లున్నవని గర్వపడరాదు. మాత్సర్యము,
కోపము, పరనింద మున్నగు
దుర్గుణములు విడనాడాలి. విషయములకు, ఆశకు
లోబడరాదు. సర్వదా
శ్రీ వేంకటేశ్వరుడే దైవమని నమ్మి ఆ పరమాత్ముని
సేవించుచూ జీవితము
గడపాలని అన్నమయ్య కీర్తిస్తున్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు

నూతన ధర్మకర్తలమండలి నియామకం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం జి.వో.ఎమ్.ఎస్.నెం.147 రెవెన్యూ(ఎండోమెంట్స్-III) తేది.27.04.2015 ప్రకారం తిరుమల తిరుపతి దేవస్థానములకు నూతన ధర్మకర్తలమండలిని నియమించింది. అధ్యక్షులు మరియు సభ్యులచే తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ డి.సాంబశివరావు, ఐ.ఏ.ఎస్., తేది.02.05.2015 న శనివారం ఉదయం 11.09 గం॥లకు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధిలో ప్రమాణస్వీకారం చేయించారు. పదవిరీత్యా (ఎక్స్‌అఫిషియో) సభ్యులుగా డా॥ డి.సాంబశివరావు, ఐ.ఏ.ఎస్., కార్యనిర్వహణాధికారితో తిరుమల సంయుక్తకార్యనిర్వహణాధికారి శ్రీ శ్రీనివాసరాజు, ఐ.ఏ.ఎస్., ప్రమాణస్వీకారం చేయించారు. వీరికి తి.తి.దే. అధికారులు శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ పోల భాస్కర్, ఐ.ఏ.ఎస్., మరియు ఆలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అధ్యక్షులు

శ్రీ చదలవాడ కృష్ణమూర్తి
(ఎక్స్ ఎమ్.ఎల్.ఎ.,) తిరుపతి

సభ్యులు

శ్రీమతి కోళ్ల లలితకుమారి, ఎమ్.ఎల్.ఎ.,
విజయనగరం

శ్రీమతి పిల్లి అనంతలక్ష్మి, ఎమ్.ఎల్.ఎ.,
కాకినాడ

డా॥ డి.ఎస్.బాల వీరాంజనేయ స్వామి, ఎమ్.బి.బి.ఎస్.,
ఎమ్.ఎల్.ఎ., ప్రకాశం జిల్లా

శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్
కడపజిల్లా

శ్రీ సండ్ర వెంకటవీరయ్య, ఎమ్.ఎల్.ఎ.,
ఖమ్మం, తెలంగాణ

శ్రీ జ్ఞాని సాయన్న, ఎమ్.ఎల్.ఎ.,
సికింద్రాబాదు

శ్రీ ఎ.వి. రమణ
హైదరాబాదు

శ్రీ వి. కృష్ణమూర్తి
తమిళనాడు

శ్రీ జె. శేఖర్
తమిళనాడు

శ్రీ డి.పి. అనంత
బెంగళూరు

శ్రీమతి ఎల్లా సుచిత్ర
హైదరాబాదు

శ్రీ కె. రాఘవేంద్రరావు
హైదరాబాదు

శ్రీ సంపత్ రవినారాయణన్
బెంగళూరు

డా॥ పసుపులేటి హరిప్రసాద్
తిరుపతి

పదవిరీత్యా (ఎక్స్ అఫిషియో) సభ్యులు

శ్రీ జె.యస్. వేంకటేశ్వర ప్రసాద్, ఐ.ఏ.ఎస్.,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ,
హైదరాబాదు

శ్రీమతి వై.వి. అనురాధ, ఐ.ఏ.ఎస్.,
కమీషనర్, దేవాదాయశాఖ,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాదు

డా॥ డి. సాంబశివరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి,
తి.తి.దే., తిరుపతి.

వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన,
వేంకటేశసమో దేవో న భూతో న భవిష్యతి.



శ్రీనివాసుడు ఆశ్రితవత్సలుడు

గౌరవ సంపాదకుడు :
డా॥ డి. సాంబశివరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకుడు :
డా॥ సి.శైలకుమార్

సంపాదకుడు : డా॥ కె.రాధారమణ
ఉప సంపాదకురాలు : డా॥ అల్లాడి సంధ్య
ముద్రాపకురాలు : యమ్.గౌతమి, యమ్.బి.ఎ.,
ఉప కార్యనిర్వహణాధికారి,
(ప్రచురణలు & ముద్రణాలయం)
తి.తి.దే., తిరుపతి
డి.టి.పి. : ప్రధాన సంపాదకులవారి
కార్యాలయం, తి.తి.దే., తిరుపతి
వర్ణ చిత్ర పుటలు : పి.శివప్రసాద్

వివరాలకు :
ప్రధాన సంపాదకుడు,
సప్తగిరి, తి.తి.దేవస్థానములు,
తిరుపతి - 517 507.
ఫోను : 0877-2264543, 2264359

సప్తగిరి
మాస
పత్రిక

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ.500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

సప్తగిరి

తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

సంపుటి : 46 జూన్, 2015 సంచిక : 1

website : www.tirumala.org, www.tirupati.org

24 గంటలు పనిచేసే
తిరుమల తిరుపతి దేవస్థానముల
కాల్ సెంటర్ ఫోన్ నెం.
0877 - 2277777, 2233333

ముఖచిత్రం : శ్రీవారి జ్యేష్ఠాభిషేకం, తిరుమల
చివరిపుట : శ్రీపద్మావతి అమ్మవారు, తిరుచానూరు

సంపాదకీయం

పుష్కరతేజం

'పుష్' అనే ధాతువునుండి 'పుష్కరం' అనే శబ్దం ఏర్పడింది. ఈ శబ్దానికి 'పోషణం' అని అర్థం. ఈ పాంచభౌతిక శరీరం అనేక ప్రయోజనాలకు, విధులకు, బాధ్యతలకు, ధర్మకార్యాలకు ఆలవాలం కనుక ఇది పోషింపదగింది. ధర్మసాధనాలలో శరీరం మొదటిది కనుక దీన్ని ఆరోగ్యవంతంగా ఉండేట్లుగా పోషించాలి. మానసిక, శారీరక ఆరోగ్యం సంప్రాప్తించటంద్వారా, పుష్కర స్నాన సమయంలో దేవపితృకార్యాలు ఆచరించడానికి అవసరమైన శక్తి సమకూరుతుంది.

పుష్కర శబ్దానికే తామరకాడ, తామరపువ్వు, తామరాకు అనే అర్థాలూ ఉన్నాయి. ఈ అర్థాలుకూడా సంసారంలో జ్ఞాని తామరపై నీటిబిందువులాగా అంటీ అంటక ఉండాలని ప్రబోధిస్తున్నాయి. గురుగ్రహ సంచారానికి సంబంధించిన కాలాన్ని చెప్పటంవల్ల – సంవత్సరానికి ఒక్కొక్కరోజుచొప్పున 12 సంవత్సరాలకు ఒకమారు పుష్కరకాలంగా నిర్దేశించి, ఆ సమయంలో జీవనదీస్నానం పుణ్యప్రదమని మహర్షుల నిర్ణయం!

ఈ చరాచర జగత్తు – నింగి, నేల, నీరు, నిప్పు, గాలి అనే పంచతత్త్వాలతో కూడి ఉంది. ఈ సత్యాన్ని అందరూ అంగీకరించి ఉన్నారు. జలం జీవాధారమైందే కాక పంచభూతాలలో అతిప్రధానస్థానం వహిస్తున్నది. వేదపురాణాలు జలంనుంచి భూమి పుట్టిందన్నాయి. ఆధునిక శాస్త్రాలన్నీ ఈ విశాల విశ్వంలో భూమికన్నా జలభాగమే ఎక్కువ అని రూఢి చేస్తున్నాయి. అన్ని దేశాల వేదాంత విజ్ఞాన సాహిత్యంలోనూ నిర్గుణపరబ్రహ్మం అయిన శక్తియొక్క ఆజ్ఞ లేదా సంకల్పంతో జలం తర్వాత భూమి ఆవిర్భవించిందనే విషయం వ్యక్తమౌతూంది.

మంత్రపూతజలం భవసాగరంనుంచి జీవుల్ని ఉద్ధరించి, శాశ్వతానందసరస్సులో నిమగ్నం చేస్తుందనే భావనతో అవసరం, అవకాశం కల్గినప్పుడంతా జలాశయాలకు చేరి, యథాశక్తిగా పవిత్రమంత్రాలు పఠించి, స్నానం చేసి, పవిత్రులు కావటం జరుగుతూంది. ప్రదేశ ప్రవాహ శుద్ధికోసం పవిత్ర మంత్రాలతో పాపపరిహారక స్నానాలు, తీర్థవిధులు, ఆసేతుహిమాచలం జరిగే కార్యకలాపాలు.

ఈ సంప్రదాయానికి చెందినవే జీవనదులకు జరిగే పుష్కరోత్సవాలు. వరుణపుత్రుడైన పుష్కరునితో కూడి, బ్రహ్మదేవుడు సర్వతీర్థ దివ్యశక్తులతో ఈ 12 రోజులు ఆయా నదీజలాలను పవిత్రవంతం చేస్తాడని శాస్త్రవాక్కు. భూమికంటే నీటికి తేజోభాగం ఎక్కువ! అందుకే నదులనుండి విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారు. అట్టి నదులలో మానవుడు స్నానము చేస్తే తేజోభాగాన్ని ఎక్కువగా పొందుతాడు. ఈ తేజస్సు జ్ఞానానికి ఉపలక్షణం. కనుక పుష్కరస్నానంవల్ల మానవుడు జ్ఞానాన్ని పొందుతున్నాడు. గురుగ్రహవీక్షణం సూటిగా నదులకు సంక్రమించిన కాలంలో స్నానం చేస్తే – మానవుడు కేవలం పునీతుడవడమే కాక సమస్త పాపాలనుండి విముక్తినీ పొందుతున్నాడు.

2015 జూలై 14 నుండి ప్రారంభమయ్యే గోదావరీ పుష్కరాల్లో మానవులందరూ స్నానాదికాలు నిర్వర్తించి, పునీతులై, ఆరోగ్యవంతులై, తేజోవంతులై, బాహ్యాంతశ్శుద్ధులై, జ్ఞానులై, ధన్యులవుతారని ఆశిద్దాం!

కృష్ణతత్త్వమే పరబ్రహ్మ తత్త్వం

డా॥ అద్దంకి శ్రీనివాస్, రీసెర్చ్ ఆఫీసర్, కేంద్రీయవిశ్వవిద్యాలయం, హైదరాబాదు, 9848881838

'వసుదేవ సుతం దేవం కంసచాణూర మర్దనమ్।
దేవకీపరమానందం కృష్ణం వందే జగద్గురుమ్'

ఈ శ్లోకం, పైకి కృష్ణుని స్తోత్రంలా కన్పిస్తున్నా – లోపల ఆధ్యాత్మికసాధనమార్గం కలిగి ఉంది. వసుదేవుడు సత్త్వగుణానికి ప్రతీక. కంసచాణూరులనే రాక్షసులు తమోరజోగుణాలకు ప్రతీకలు. సత్త్వగుణోపాసనద్వారా రాక్షస ప్రవృత్తుల్ని మర్దిస్తేనే పరమానంద సదృశమైన పరబ్రహ్మతత్త్వం అవగతమౌతుంది. అందుకే ఈ ఆనందాన్ని దేవకితో పోల్చాడు. దేవకి జగత్తుకే గురువై యోగమార్గాన్ని బోధించిన శ్రీకృష్ణునికి కన్నతల్లి. అంటే బ్రహ్మానందం ఆమె వెంటే ఉంటుందన్న మాట. శ్రీకృష్ణుని ఘనచరిత నిండా ఎన్నో ఎన్నెన్నో ఆధ్యాత్మిక సందేశకిరణాలు సాధకులను తేజోవంతుల్ని చేస్తాయి. వేణుగానలోలుని ప్రతిమాటా, చేతా, ఆలోచనా సందేశాలపుట్టే. సామాన్యులకు సందేహాల పుట్టువే. ఒకసారి శ్రీకృష్ణ పరమాత్మ అష్టమహిషులతో కొలువై ఉన్నాడు. బయట హోరున వర్షం. యమున పొంగి పారుతోంది. ఆ నదికి ఒడ్డుపై దుర్వాసమహర్షి ఆకలితో అలమటిస్తున్నాడు. ఆర్తత్రాణ పరాయణుడైన శ్రీకృష్ణునికి అతనిబాధ అర్థమయ్యింది. తన భార్యలను పిలిచి, మహర్షి ఆకలి తీర్చండని ఆదేశించాడు. 'ఇంత వానలో యమున ఉప్పొంగుతున్న స్థితిలో నది ఎలా దాటడం?' ఇది వారిసందేహం. దాన్నికూడా స్వామి ముందే గ్రహించి 'మమ్మల్ని నిత్యబ్రహ్మచారి పంపించాడని చెప్పండి. యమున దారి ఇస్తుంది' అని చెప్పాడు. వారూ అలాగే చేశారు. ఆశ్చర్యం! యమున దారి ఇచ్చింది. నది దాటి మహర్షిఆకలి తీర్చారు. తిరిగి అక్కడినుండి వెళ్లాలంటే యమున యథాపూర్వం పొంగిపారుతోంది. వారప్పుడు మహర్షితో జరిగింది చెప్పారు. శ్రీకృష్ణుడు చెప్పమన్నదీ చెప్పారు. దానికి మహర్షి నవ్వి "మమ్మల్ని నిత్య ఉపవాసి పంపాడని చెప్పండి యమున దారి ఇస్తుం" దని చెప్పాడు. వారూ అలాగే చెప్పారు. యమున మళ్ళీ దారి ఇచ్చింది. ఇంటికి చేరుకున్న భార్యలు సందేహంతో శ్రీకృష్ణుణ్ణి ప్రార్థించారు. అప్పుడు శ్రీకృష్ణుడు "మీరంతా ఉండగా నేను బ్రహ్మచారిని ఎలా అవుతాననేగా మీ సందేహం? అలాగే అప్పుడే భోజనం చేసిన మహర్షి నిత్యోపవాసి ఎలా అవుతాడనేగా మీ అనుమానం? అని ప్రశ్నించి, దానికి సమాధానం ఇలా చెప్పాడు.



'చూడండి! బ్రహ్మచారి అంటే బ్రహ్మం గురించి చరించేవాడని అర్థం. పరబ్రహ్మ స్వరూపంకోసం తపించేవాడు, సాధన చేసేవాడూ సంసారి అయినా బ్రహ్మచారే. అలాగే 'ఉపవాసి' అంటే భగవత్సమీపంలో జీవించేవాడని అర్థం. అంటే సర్వకాల సర్వ అవస్థలలోనూ భగవంతుణ్ణి హృదయంలో నిల్పుకొనేవాడు నిత్యోపవాసి. అందుకే యమున దారి ఇచ్చింది. అసలయిన సత్యజ్ఞానాన్ని భ్రమలతోనో, అపోహలతోనో సతమతమవుతూ తెలుసుకోలేకపోతుంటారు. నివురు కప్పిన నిప్పులా తెల్లనికిరణంలో ఉండే సర్వవర్ణాల తేజస్సులా సత్యం ప్రకాశిస్తుంటుంది. దానిని గుర్తించేవాడే నిజమైన సాధకుడు. ఇలా చెప్పడంతో ఆశ్చర్యపోవడం దేవేరులవంతయ్యింది.

శ్రీహరి అవతారాలలోనే – బుద్ధివికాసాన్ని ఉపయోగించే సాధనమార్గంద్వారా పరమపదాన్ని సాధించాలనే సందేశమే శ్రీకృష్ణావతారం. కృష్ణుడంటేనే ఆకర్షించేవాడని అర్థం. అందుకే నవనీతచోరునిలీలలన్నీ సుగుణాలై, భక్తులకు మనోహరాలయ్యాయి.



శ్రీకృష్ణజననంనుండి మరణంవరకూ ఏ సంఘటనను విశ్లేషించినా అందులో ఆధ్యాత్మికకుసుమాలు వికసిస్తాయి. భగవద్గీత సారాంశం సాధకుని ప్రవృత్తికి సానపెట్టేదే. మనకు కోరికలు అనేకం. అందుకే కోరికలు కౌరవుల్లాంటివారు. ఈ కోరికలు పంచేంద్రియాలను పీడిస్తూఉంటాయి. దానికి కారణం మనసు. అందుకే మనసుకు ద్రౌపది, ఇంద్రియాలకు పాండవులు ప్రతీకలు. బుద్ధి దీన్ని నియంత్రిస్తుంది. అది శ్రీకృష్ణుడు. శ్రీకృష్ణుడనే బుద్ధి – మనస్సు కారణంగా పంచేంద్రియాలు అనే పాండవుల్ని పీడించే కోరికలు అనే కౌరవులదర్పం అణచడమే మహాభారత రహస్యం. ఇదే భగవద్గీత సారాంశం. బాలకృష్ణుని చేతిలో ఉండే వెన్నముద్ద సృష్టి అస్థిరతకు నిదర్శనం. చెంగల్వపూదండ వయస్సుకూడా కరిగిపోయేదని చెప్తుంది. బంగారు మొలత్రాడు ఐశ్వర్యానికి ప్రతీక. గజ్జెలు చైతన్యానికి, తాయెత్తులు ధార్మికనిష్ఠకు ప్రతీకలు. వీటన్నింటిబట్టే అశాశ్వతమైన ఈ లోకంలో ఐశ్వర్యంతో సహా అన్నీ అస్థిరాలే. నియమపూర్వకమైన సాధనమార్గంలో నిత్యచైతన్యస్వరూపులైన మానవులు ఆత్మశక్తిని ఉద్దీపితం చేసుకొని, దానికి ఆర్షధర్మం చూపిస్తున్న కర్మనిష్ఠను ఆలంబనంగా చేసుకొని, మోక్షగామి కావాలనే సందేశం జగద్గురువైన శ్రీకృష్ణునిద్వారా అందే సందేశం.

పుష్కరుని వృత్తాంతం

డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య

ఒకప్పుడు 'తుందిలు' డనే మహర్షి చాలాకాలం తపస్సు చేసి, భగవత్కృపకు పాత్రుడై, మూడున్నరకోట్లతీర్థాలకు అధిపతి అయి, 'పుష్కరుడు' అనే పేరుతో ప్రసిద్ధుడయ్యాడు. పుష్కరమంటే జలం. భగవంతుని ఎనిమిది మూర్తుల్లో (పంచభూతాలు + మనస్సు, బుద్ధి, అహంకారం = 8) ఇందులో జలం ఒకటి. తుందిలుడు భగవంతునియొక్క జలరూపాన్ని పొందడంవల్ల అతనికి 'పుష్కరుడు' అని ప్రసిద్ధి వచ్చింది.

బ్రహ్మ దీక్షతో తపస్సుచేసి, భగవంతుణ్ణి మెప్పించి, సృష్టికార్యంలో పుష్కరుడు తనకు ఉపయోగపడతా డనీ, కనుక అతణ్ణి తనకు ఇమ్మనీ ప్రార్థించాడు. 'అట్లే' అన్నాడు – భగవంతుడు. జలరూపంతో ఉండే పుష్కరుణ్ణి కమండలంలో ఉంచుకొని, బ్రహ్మ లోకాలను సృష్టించసాగాడు.

ఇలా కొంతకాలం గడిచింది. సృష్టి జరుగుతూంది. బృహస్పతి ఎట్లో బ్రహ్మను ప్రసన్నుణ్ణి చేసుకొన్నాడు. బ్రహ్మ 'ఏం కావా' ? లన్నాడు. అవకాశం దొరికిందికదా అని – 'పుష్కరుడు నాకు కావాలి' అన్నాడు. బ్రహ్మ 'సరే' నన్నాడు. కానీ పుష్కరునికి బ్రహ్మను వదలి, బృహస్పతి వద్దకు పోవడం ఇష్టంలేదు. 'అలా పో' నని కూడా చెప్పాడు – బ్రహ్మతో. అయితే అందరూ ఆలోచించి, "బృహస్పతి ఎప్పుడు క్రొత్తరాశిలో ప్రవేశించినా – మొదటి పన్నెండురోజులూ, చివరి పన్నెండు రోజులూ – ఆ సంవత్సరంలోని మిగిలిన రోజుల్లో మధ్యాహ్నం నాలుగు ఘడియలు (96 నిమిషాలు) మాత్రం పుష్కరుడు బృహస్పతి ఆధీనంలో ఉండా" లని నిర్ణయించారు. ఆ సమయంలో సకలదేవతలతోకూడా బ్రహ్మ పుష్కరునితో ఉండాలి. మూడున్నరకోట్ల పుణ్యతీర్థాలకు అధిపతి అయిన పుష్కరుడు ఈ నియమాన్ని అనుసరించి, బ్రహ్మాదిదేవతలతో, బృహస్పతితో కలసి, ఏ నదికి పుష్కరం వస్తుందో ఆ నదిలో నివసిస్తాడు. ఆకాలం ఆనదికి మహాపుణ్యకాలం! దేవతలందరూ ఆ సమయంలో ఆ నదిలో ఉండటంవల్ల దాని ప్రభావం ఎన్నోరెట్లు పెరుగుతుంది. పుష్కరనదులలో చేసే ఏ పవిత్రకార్యమైనా తత్క్షణమే సత్ఫలాన్ని అనుగ్రహిస్తుంది. పుష్కరస్నానం తాపాలనూ, పాపాలనూ హరిస్తుంది. సమస్తశుభాలూ ప్రసాదిస్తుంది. పుష్కరస్నానమహిమతో పునీతులం అవుదాం!!!

అష్టాక్షర మహామంత్ర ప్రభావం

డా॥ పి. వెంకటరాజు, భీమవరం

శ్రీ మహావిష్ణుదైవత్వాలైన మహామంత్ర మండలాలలో "ఓం నమో నారాయణాయ" అనే అష్టాక్షర మహామంత్రం – విష్ణుభక్తులకు ముక్తిదాయకం. ఈ అష్టాక్షర మహామంత్రాన్ని జపిస్తే జనన మరణాత్మకమైన సంసారబంధంనుండి మనుష్యుడు ముక్తిని పొందుతాడు.

"ప్రహ్లాద నారద పరాశర పుండరీక -
వ్యాసాంబరీషశుకశౌనక భీష్మదాల్భ్యాన్ ।
రుక్మాంగదార్జున వసిష్ఠవిభీషణాదీన్
ఏతా నహం పరమభాగవతాన్ స్మరామి ॥"

ప్రహ్లాదుడు – నారదుడు – పరాశరుడు – పుండరీకుడు – వ్యాసుడు – అంబరీషుడు – శుకుడు – శౌనకుడు – భీష్ముడు – దాల్భ్యుడు – రుక్మాంగదుడు – అర్జునుడు – వసిష్ఠుడు – విభీషణుడు – మొదలైనవారిని పరమభాగవత శిఖామణులుగా చెప్తారు. వీరు నారాయణ – అష్టాక్షర మహామంత్రాన్ని నిత్యం జపించి, పరమభాగవతులుగా ప్రసిద్ధి చెందారు. నారాయణ సాన్నిధ్యాన్ని పొందారు. ఇట్టి పరమభాగవతులను స్మరించుటకూడా ముక్తిదాయకం.



మానవులయొక్క హృదయ పద్మమధ్యలో శంఖచక్ర గదాధరుడయిన నారాయణుడు ఉన్నాడు. ఆయనను ఏకాగ్రమయిన మనస్సుతో ధ్యానించి, ఈ అష్టాక్షర మహామంత్రాన్ని జపించాలి. ఈ అష్టాక్షర మహామంత్రానికి – స్వయంగా నారాయణుడే ఋషి. ఛందం దైవీగాయత్రి. పరమాత్మ దేవత. ఏకాంత ప్రదేశంలో – సుఖాసనంతో కూర్చొని, నిర్మలనిశ్చల చిత్తంతో శ్రీమహావిష్ణుస్వరూపాన్ని ధ్యానించి, అష్టాక్షర మహామంత్రాన్ని జపించాలి.


''ఓం నమో నారాయణాయ'' – అనేఅష్టాక్షర మహామంత్రంలోని – 'ఓం' కారము శుక్లవర్ణం. 'న' కారం – రక్తవర్ణం కల్గింది. 'మో' కారం కృష్ణవర్ణం కల్గింది. 'నా కారం – రక్తవర్ణం కల్గింది. 'రా' కారం కుంకుమవర్ణం కల్గింది. 'య' కారం పీతవర్ణం కల్గింది. 'ణా' కారం – కాటుకవర్ణం కల్గింది. 'య' కారం బహువర్ణాలు కల్గింది. ఈ మహామంత్రం సర్వార్థసాధకం. ఈ మహామంత్రాన్ని జపించే భక్తులకు స్వర్గమోక్షఫలాలు సిద్ధిస్తాయి. హృదయం – అష్టదళకమలం. అష్టదళాలు – ఈ అష్టవర్ణాలను కలిగి ఉంటాయి.

అష్టాక్షరమహామంత్రం అష్టమూర్త్యాత్మకం. మొదటి అక్షరం పృథ్విని, రెండవ అక్షరం జలరూపాన్ని, మూడవ అక్షరం అగ్ని రూపాన్ని, నాల్గవ అక్షరం వాయు రూపాన్ని, అయిదవ అక్షరం ఆకాశ రూపాన్ని, ఆరవ అక్షరం చంద్ర స్వరూపాన్ని, ఏడవ అక్షరం సూర్య రూపాన్ని, ఎనిమిదవ అక్షరం యజమాన రూపాన్ని – ఈ విధంగా అష్టాక్షర మహామంత్రం ఈ విధంగా అష్ట మూర్త్యాత్మకంగా అవుతున్నది.

భూమి రాప స్తథా తేజో వాయుర్వ్యోమ చ చంద్రమాః।
సూర్యః పుమాం స్తథాచేతి మూర్తయ శ్చాష్టకీర్తితాః॥
(నారాయణోపనిషత్తు)

"యచ్చకించిత్ జగత్సర్వం దృశ్యతే శ్రూయతేఽపివా।
అంతర్బహి శ్చ తత్ సర్వం వ్యాప్య నారాయణః స్థితః॥
(నారాయణసూక్తమ్)

ఈ కన్పించే – విన్పించే – సమస్త జగత్తుయొక్క లోపలా, బయటా, అంతటా – నారాయణుడు వ్యాపించిఉన్నాడు.



అనగా పరబ్రహ్మ – పరంజ్యోతి – పరంతత్త్వ – పరమాత్మ శబ్దాలు బోధించే – ఏ పరమాత్మ కలడో – ఆయన – అంతటా వ్యాపించి ఉన్నాడని తెల్పడం – 'నారాయణ' శబ్దానికి అర్థం. అనగా నారాయణశబ్దం – పరమాత్మ యొక్క సర్వవ్యాపకత్వాన్ని బోధిస్తుంది.

వైదిక సంప్రదాయంలో నారాయణ – వాసుదేవ – విష్ణు – అనే మూడు నామాలను – పరమాత్మ యొక్క సర్వవ్యాపకత్వ బోధకాలు **"వ్యాప్నోతీతి విష్ణుః"** అని వ్యుత్పత్తి. **"విశ్వవ్యాపనశీలత్వా ద్విష్ణురిత్యుచ్యతే బుధైః"**

ఈ కలియుగంలో శ్రీ వేంకటేశ్వరుని నామజపమే మోక్షమార్గం. ఏకాగ్రతతో కొన్ని క్షణాలైనా శ్రీ వేంకటేశ్వర నామాన్ని జపించాలి



"అష్టాక్షర శ్చ యో మంత్రో ద్వాదశాక్షర ఏవ చ।
షడక్షర శ్చ యో మంత్రో విష్ణో రమిత తేజసః॥
ఏతే మంత్రాః ప్రధానా స్తు వైదికాః ప్రణవై ర్యుతాః।"

అష్టాక్షర మంత్రమైన – "ఓం నమో నారాయణాయ", ద్వాదశాక్షరమంత్రమైన – "ఓం నమో భగవతే వాసుదేవాయ॥" షడక్షరమంత్రమైన – "ఓం విష్ణవే నమః" అనే ఈ మూడు మహామంత్రాలు వైదికాలు అయిన వైష్ణవ మంత్రాలు. (పారమాత్మికోపనిషత్తు)

'వాసుదేవ' నామం కూడా శ్రీమహావిష్ణువు మహిమను సర్వ వ్యాపకత్వాన్ని బోధిస్తుంది. "వాసనాత్ వాసుదేవస్య వాసితం తే జగత్త్రయమ్ – సర్వభూత నివాసోఽసి వాసుదేవ నమోఽస్తు తే!
(విష్ణుసహస్రనామము)

"నారాయణం నమస్కృత్య
నరం చైవ నరోత్తమమ్।
దేవీం సరస్వతీంచైవ తతో జయ ముదీరయేత్॥"

ఇది మహాభారత ప్రారంభంలో వ్యాస భగవానుడు చేసిన ప్రార్థన. ఇందులో మొట్టమొదట ప్రయోగించిన "నారాయణ" నామానికి చేసిన వ్యాఖ్యానం అమితమోదావహం.

'నరః' అనగా అవిద్యతోకూడిన చైతన్యరూపమైన జీవతత్త్వం. ముత్యపుచిప్పలో కల్పించబడిన వెండిలాగ, పరబ్రహ్మలో కల్పించబడిన ఈ చరాచరజగత్తు అప్శబ్దవాచ్యమైన – నారం=నీరు. ఇట్టి నారంలో శయనించినవాడు – లేక – నారం శయనంగా కలవాడు నారాయణుడు. అనగా జీవచైతన్యం శయనంగా సర్వత్ర వ్యాపించిఉన్న – పరంబ్రహ్మ – పరంజ్యోతి పరతత్త్వ రూపమైన – పరమాత్మయే! నారాయణశబ్దవాచ్యుడు, ఇట్టి అష్టాక్షరమహా మంత్రాన్ని స్మరించినంత మాత్రాన జనన మరణాత్మక సంసారబంధం నుండి మానవుడు విముక్తుడౌతాడు.

వ్యాసభాగవతం - అవతారిక

ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, విశాఖపట్నం, 9490084217

అష్టాదశ పురాణాలలో శ్రీమహాభాగవతం అత్యంత ప్రశస్తమైంది. ఇది వ్యాసర్షి ప్రణీతం. బ్రహ్మతత్త్వ నిరూపకమైన ఈ భాగవతకథను పరీక్షిన్మహారాజుకు శుకయోగీంద్రుడు ఉపదేశించారు. భాగవతానికి సాత్త్వత సంహిత, పారమహంస్య సంహిత అని కూడా వ్యవహారం. భక్తిచేతనే భాగవతం తెలియదగింది - పాండిత్యంచేగాని టీకచేగానికాదు. "భక్త్యా భాగవతం జ్ఞేయం న వ్యుత్పత్త్యా న టీకయా" అని పెద్దలమాట! "విద్యావతాం భాగవతే పరీక్షా" అని ఈ గ్రంథం విద్వాంసులకు పరీక్షాగ్రంథంగా ప్రసిద్ధి పొందింది.

భగవంతునియందు ఆసక్తులు భాగవతులు, వారి చరిత్ర భాగవతం. భాగవత పదంలోని నాల్గు అక్షరాలను ఉద్దేశించి భక్తి, జ్ఞాన, వైరాగ్య, తత్త్వ నిరూపకమైన గ్రంథం భాగవతం అని పౌరాణికులు పేర్కొంటారు.

శ్రీమహాభాగవతాన్ని మొట్టమొదట శ్రీమన్నారాయణుడు తన పుత్రుడైన బ్రహ్మకు ఉపదేశించినాడు. అదే చతుశ్శ్లోకీ భాగవతం. బ్రహ్మ ఆ భాగవతాన్ని నారదునికి, నారదుడు వ్యాసమహర్షికీ, ఆ మహర్షి శుక యోగికి తెలుపుట, శుకయోగి పరీక్షిన్మహారాజుకూ ఉపదేశించాడు. వ్యాసభగవానుడు ఆగ్రంథాన్ని పన్నెండు స్కంధాలలో - పద్దెనిమిది వేల శ్లోకాలలో మహాపురాణంగా రచించి, లోకానికి అందించినాడు.

వ్యాసముని భాగవతంలోని తొలిశ్లోకాన్ని భాగవత ప్రతిపాద్య పరదేవతానుస్మరణ పూర్వకంగా రచించినాడు. 'మంగళాదీని' అనే సంప్రదాయాన్ని పాటించినాడు.

జన్మాద్యస్య యతోఽన్వయాదితరతశ్చార్థేష్వభిజ్ఞః స్వరాట్
తేనే బ్రహ్మ హృదా య ఆదికవయే ముహ్యంతి యత్సూరయః ॥
తేజో వారి మృదాం యథా వినిమయో యత్ర త్రిసర్గోఽమృషా
ధామ్నాస్వేన సదా నిరస్తకుహకం సత్యం పరం ధీమహి" 1-1-1.

ఈ జగత్తుయొక్కజన్మ మొదలైనది ఎవనినుండి సంభవిస్తోందో, విశ్వకార్యములందు అన్వయ వ్యతిరేకాలచే అంతటా తెలియదగినవాడెవ్వడో, స్వయంగా ప్రకాశించేవాడెవ్వడో, బ్రహ్మకు స్వయంగా వేదాన్ని హృదయమందు ఎవడు ప్రకాశింపజేసినాడో, బ్రహ్మాదులు ఎవనియందు మోహాన్ని పొందుతారో, తేజస్సు నీరు మన్ను అనేవి వినిమయం పొందేటట్లు సత్త్వరజస్తమోగుణాత్మకమైన సృష్టి ఎవనియందు సత్యంగా భాసిస్తోందో, తన తేజస్సుచే ఎల్లప్పుడు తొలగిన కపటంగలవాడెవడో, అట్టి సత్యస్వరూపుణ్ణి, సర్వానికీ పరుడైన ఈశ్వరుణ్ణి ధ్యానిస్తాము" అని తాత్పర్యం.

ఈ ఆరంభ శ్లోకంలోని 'జన్మాద్యస్య యతః' అనేది బ్రహ్మం యొక్క తటస్థ లక్షణం. సత్యమ్ అనేది స్వరూపలక్షణం. బ్రహ్మతత్త్వ ప్రతిపాదకంగా భాగవతాన్ని వ్యాసపరమాత్మ రచింపబూనినట్లు ఆరంభశ్లోకం బోధిస్తోంది.

భాగవత ప్రాశస్త్యాన్ని వివరిస్తూ మత్స్యపురాణం "యత్రాధికృత్య గాయత్రీం వర్ణ్యతే ధర్మ విస్తరః" అనీ, స్కాందపురాణం "గాయత్ర్యా చ సమారంభః" అనీ, గరుడపురాణం "గాయత్రీ భాష్యరూపోఽసౌ" అనీ పేర్కొంటున్నాయి. భాగవతానికి అద్వైతపరంగా భావార్థదీపిక అనే వ్యాఖ్య రచిస్తూ, శ్రీధర పండితులు ఈ తొలిశ్లోకాన్ని గాయత్రీ మంత్ర పరంగా ఇలా సమన్వయించారు.



ఈ శ్లోకంలోని 'జన్మాద్యస్య' అనే పదద్వయం గాయత్రీమంత్రంలోని 'సవితుః దేవస్య' అనే పదద్వయాన్ని బోధిస్తుంది. 'పరమ్' అనే పదం

తిరుమల తిరుపతి దేవస్థానం పురాణఇతిహాస ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీమద్భాగవత సదస్సులో సమర్పించినవ్యాసం.

'వరేణ్యమ్' అనే పదాన్నీ, "స్వరాట్ ధామ్నాస్వేన సదా నిరస్తకుహకమ్" అనే పదాలు భర్గః, అనే పదాన్నీ, 'తేనే బ్రహ్మ య ఆది కవయే' అనే శ్లోకభాగం. ధియో యోనః ప్రచోదయాత్, అనే మంత్ర పదాలనూ, శ్లోకంలోని 'సత్యమ్' అనే పదం మంత్రంలోని 'తత్' అనే పదాన్నీ, శ్లోకంలోని 'అస్య' అనే పదం మంత్రంలోని 'దేవస్య' అనే పదాన్ని బోధిస్తాయి. 'ధీమహి' అన్న క్రియాపదం శ్లోకంలోనూ, మంత్రంలోనూకూడా సమానమే. శ్లోకంలోని 'హృదా' అనే పదం విభక్తి వ్యత్యయం పొంది మంత్రంలోని 'ధియః' అనే పదాన్ని బోధిస్తుంది. శ్లోకంలోని 'ఆదికవయే' అనేపదం మంత్రంలోని 'నః ' అనే పదాన్నీ శ్లోకంలోని 'తేనే' అనే పదం మంత్రంలోని 'ప్రచోదయాత్' అనే పదాన్నీ తెలుపుతోంది.

దేవీభాగవతంలో గాయత్రీమంత్రానికి సంబంధించిన విశేషాలు ఎక్కువగా ఉండడంవల్ల కొందరు ఆపురాణమే అష్టాదశపురాణాలలో పరిగణింప దగిందని భావించారు. కాని ఈశ్రీధరపండితుల సమన్వయం ఆధారంగా విద్వల్లోకం విష్ణుకథా ప్రధానమైన భాగవతాన్నే మహాపురాణంగా ఆమోదించింది. ఇక భాగవతంలోని రెండవ శ్లోకం –

ధర్మః ప్రోజ్ఝితకైతవోఽత్ర పరమో నిర్మత్సరాణాం సతాం
వేద్యం వాస్తవమత్ర వస్తు శివదం తాపత్రయోన్మూలనమ్।



శ్రీమద్భాగవతే మహాముని కృతే కిం పరైరీశ్వరః।
సద్యో హృద్యవరుధ్యతేఽత్ర కృతిభిః శుశ్రూషు భి స్తత్ క్షణాత్॥

1-1-2

శ్రీమన్నారాయణుడు మొట్టమొదట సంక్షేపంగా చెప్పిన (చతుశ్శ్లోకీరూపమైన) భాగవతగ్రంథమందు మాత్సర్యంలేనివారై సర్వభూతములందు దయగల మహాత్ముల శుద్ధభక్తిరూపమైన పరమధర్మం నిరూపింపబడింది. అది వాంఛలు లేనిది. ఈ భాగవతంలో ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతికాలనే తాప త్రయాలనూ, వాటికి మూలమైన అవిద్యను నాశనం చేసేదీ, పరమానందాన్ని అనుభవింపజేసేదీ, ఆదిమధ్యావసానాలలో స్థిరంగా ఉండేదీ అయినటువంటి పరమార్థభూతమైన తత్త్వం ఉపదేశింపబడింది. అది తెలుసుకోదగింది. దాన్ని తెలుసుకొంటే ఇతర శాస్త్రాదులవల్ల ప్రయోజనం ఉండదు. ఈ భాగవత గ్రంథాన్ని వినాలనే కోరికగల పుణ్యుల హృదయంలో ఆక్షణమే ఈశ్వరుడు బంధింపబడతాడు అని భావం.

'కృతిభిః శుశ్రూషుభిః' అనే పదాలవల్ల భాగవతాన్ని వినేకోరిక పుణ్యాత్ములకు తప్ప తక్కినవారికి సాధ్యపడదని సూచన. 'వేద్యమ్' అనే పదంవల్ల కర్మ జ్ఞాన కాండలకంటె – ఇతర శాస్త్రాలకంటేకూడా భాగవతతత్త్వం శ్రేష్ఠమైంది కాబట్టి తప్పక తెలుసుకో దగిందని శ్రీధరుల సమన్వయం. ఈ రెండవ శ్లోకంలో శ్రవణవిధి నిర్దేశింపబడింది.

ఇక మూడవ శ్లోకం:

నిగమ కల్ప తరో ర్గళితం ఫలం
శుకముఖా దమృతద్రవ సంయుతమ్।
పిబత భాగవతం రస మాలయం
ముహురహో రసికా భువి భావుకాః॥ **1-1-3.**

భాగవతమనేఫలం వేదమనే కల్పవృక్షంనుండి జారిపడింది. చిలుక ముక్కునుండి బయల్వెడలింది. అమృతరసంతో కూడింది. రసరూపమైంది. కాబట్టి భావుకులు (భక్తులు) మాటిమాటికీ ఆభాగవతఫల రసాన్ని ఆస్వాదింతురుగాక! అని భావం.

చిలుకముక్కు తగిలిన పండు మధురం అని ప్రసిద్ధి. ఈ భాగవతఫలంకూడా అట్టిదే! శుకమహర్షి ముఖంనుండి

వెలువడింది. 'అమృతద్రవ సంయుతమ్' అంటే పరమానంద భరితమని అర్థం." రసో వైసః రసగ్ హ్యేవాయం లబ్ధ్వా ఉ నందీ భవతి" అని శ్రుతి. పరమానందాన్ని అనుభవించడంలో ఆసక్తులైనవారు మాటిమాటికీ (నిత్యమూ) భాగవతాన్ని సేవించాలని ఉపదేశం.

ఈ విధంగా ఆరంభశ్లోకాలు మూడూ భాగవత పరమార్థాన్ని నిరూపిస్తున్నాయి.

సూతవచనం

నైమిశారణ్యంలో మహర్షులు సహస్రవర్షపరిమితిగల యజ్ఞం చేస్తూ సూతమునిని "మహాత్మా! ఏది అత్యంతమైన శ్రేయస్సు? సమస్త ప్రాణుల మనస్సు దేనిచేత ప్రసన్న మౌతుంది? శ్రీకృష్ణభగవానుడు దేవకీదేవియందు ఏమి ఆచరించడానికి ఆవిర్భవించాడు?" అని ప్రశ్నిస్తారు.

సూతముని పరమానందంతో "మహర్షులారా! కృష్ణుని గూర్చిన ప్రశ్నవల్ల మనస్సు ప్రసన్నమౌతుంది. అధోక్షజునందు భక్తి ఉత్తమోత్తమధర్మం. అది నిర్హేతుకమైనది. అప్రతిహతమైనది. దానిచేతనే మనస్సు ప్రసన్నమౌతుంది. పరమాత్మయందు భక్తియోగం తత్‌క్షణం వైరాగ్యాన్ని కల్గిస్తుంది. అహైతుకమైన జ్ఞానాన్నికూడా పొందిస్తుంది" అని ఇలా అంటాడు–

యత్కృతః కృష్ణ సంప్రశ్నో యేనాత్మా సుప్రసీదతి॥
సవై పుంసాం పరో ధర్మః యతో భక్తి రధోక్షజే।
అహైతుక్యప్రతిహతా యయాత్మా సుప్రసీదతి॥
వాసుదేవే భగవతి భక్తియోగః ప్రయోజితః
జనయ త్యాశు వైరాగ్యం జ్ఞానం చ యదహైతుకమ్॥

1–2–5,6,7.

భక్తి యోగ విశిష్టతను వివరించి, సూతుడు శౌనకాదులతో "పండితులు పరమసంతోషంతో మనస్సును ప్రసన్నంచేసే భక్తిని పరమాత్మయైన వాసుదేవునియందు నిల్పుతారు'' అని ఉదాహరిస్తాడు.

అతో వై కవయో నిత్యం భక్తిం పరమయా ముదా।
వాసుదేవే భగవతి కుర్వం త్యాత్మ ప్రసాదినీమ్ ॥

1–2–22

ఈ సందర్భంలో వాసుదేవతత్త్వాన్ని కూడా ఇలా కీర్తిస్తాడు.

వాసుదేవపరా వేదా వాసుదేవపరా మఖాః
వాసుదేవపరా యోగా వాసుదేవ పరాః క్రియాః॥
వాసుదేవపరం జ్ఞానం వాసుదేవపరం తపః
వాసుదేవపరో ధర్మో వాసుదేవపరా గతిః॥

1–2–28,29.

ఈ విధంగా గ్రంథారంభంలో సూతమహాముని భక్తి యొక్క ప్రాశస్త్యాన్నీ వాసుదేవతత్త్వాన్నీ వ్యాఖ్యానించి భాగవత పరమార్థాన్ని ఆవిష్కరిస్తాడు.

శోకనివృత్తి

నారదుని ఉపదేశాన్ని పురస్కరించుకొని వాల్మీకి మహర్షి శ్రీమద్రామాయణాన్ని రచించినాడు. వేదవ్యాసమహర్షి శ్రీమహాభాగవతరచన గావించడానికి కూడా నారదమహర్షియే ప్రధానకారకుడు.

ఒకప్పుడు వ్యాసభగవానుడు సరస్వతీ నదీతీరంలో వికలమనస్కుడై ఉంటాడు. అక్కడికి నారదమహర్షి రాగా "నా ఈ



అవస్థకు కారణం వివరింపు" మని ప్రార్థిస్తాడు. అప్పుడు ఆ దేవర్షి వ్యాసమహర్షికి కర్తవ్యాన్ని ఇలా ఉపదేశిస్తాడు.

"మునివర్యా! నీవ్వు ధర్మాది పురుషార్థాలను వర్ణించినట్లు వాసుదేవుని మహిమను వర్ణించలేదు" - అంటూ

శ్రీకృష్ణుని వైభవాన్ని నారదుడు వివరించి, శ్రీహరి మాహాత్మ్యాన్ని వర్ణింపుమని 'మహానుభావాభ్యుదయోఽధిగణ్యతామ్' అని ఆదేశిస్తాడు. (1-5-21)

ఈవిధంగా నారదమునీంద్రుడు భక్తియోగాన్నీ వాసుదేవతత్త్వాన్నీ ఉపదేశించి, భాగవతరచనకు ప్రోత్సహింపగా వ్యాసభగవానుడు ఈమహాపురాణాన్ని రచిస్తాడు.

శుకోపదేశం

శృంగి అనే మునికుమారుడు శపించగా-విరక్తుడై గంగానదీతీరంలో ప్రాయోపవిష్టుడైయున్న పరీక్షిన్మహారాజు తనయొద్దకు వచ్చిన శుకయోగీంద్రుణ్ణి "మహాత్మా! నీవు యోగులకు పరమగురుడవు. మరణిస్తున్న మనిషికి ఏది కర్తవ్యం? ఏది వినదగింది? ఏది జపింపదగింది? ఏది ఆచరింపదగింది? ఏది స్మరింపదగింది? ఏది సేవింపదగింది? చెప్పు. లేదా దీనికి విపరీతమైన దాన్నైనా వివరించు" అని ప్రార్థిస్తాడు.



తస్మా ద్భారత సర్వాత్మా భగవా నీశ్వరో హరిః
శ్రోతవ్యః కీర్తితవ్య శ్చ స్మర్తవ్యశ్చేచ్ఛతాఽ భయమ్॥
ప్రాయేణ మునయో రాజన్ నివృత్తా విధిషేధితః
నైర్గుణ్యస్థా రమంతే స్మ గుణానుకథనే హరేః॥

2-1-5,7

ఆ పిమ్మట ఆశుకయోగి "ఈ భాగవతం అనే పురాణం వేదాలతో సమానమైంది. ద్వాపరయుగారంభంలో తండ్రియైన ద్వైపాయనుడు చెప్పగా నేను అధ్యయనం చేశాను. రాజర్షీ! నిర్గుణ బ్రహ్మమునందు పరినిష్ఠుడనైనప్పటికీ ఉత్తమ శ్లోకుడైన శ్రీకృష్ణుని లీలలచే ఆకర్షింపబడిన మనస్సుగలవాడనై ఈభాగవతాన్ని అధ్యయనం చేశాను. నీకు భాగవతం చెప్తాను. నీవు గొప్ప విష్ణు భక్తుడవు. శ్రద్ధగలవారికి ముకుందునియందు అహైతుకమైన బుద్ధి కల్గుతుంది" అని ప్రవచిస్తాడు.

పరీక్షిత్తుకు శుకబ్రహ్మ భాగవతాన్ని ఉపదేశిస్తాడు. శుకమహర్షి పరీక్షిత్ప్రభువుకు వివరించిన 1. సర్వాత్ముడైన శ్రీహరి శ్రోతవ్యుడు, కీర్తితవ్యుడు, స్మర్తవ్యుడు 2. ఈ భాగవతం వేదసమ్మితం 3. నిర్గుణ బ్రహ్మానుభూతి పొందేవారుకూడా పుణ్యశ్లోకుడైన శ్రీకృష్ణుని లీలలకు ఆకర్షితులై భాగవతాన్ని అధ్యయనం చేస్తారు - అనే మూడువిషయాలు భాగవత తత్త్వాన్ని సంగ్రహంగా సూచిస్తున్నాయి. తక్కినగ్రంథం సర్వం ఈ వాక్యాలకు వ్యాఖ్యాప్రాయమనదగింది.

వ్యాసపరమాత్మ భాగవతపురాణానికి అవతారికా ప్రాయంగా ప్రధానకథకు ముందుగా రచించిన సన్నివేశాలు భాగవత కథాపరమార్థాన్ని నిరూపిస్తూ ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకొంటున్నాయి.

విషాదగ్రస్తుడైన అర్జునుణ్ణి నిమిత్తంగా చేసుకొని, ఆనాడు శ్రీకృష్ణపరమాత్మ పద్దెనిమిది అధ్యాయాల భగవద్గీతను ఉపదేశింపగా-ప్రాయోపవిష్టుడైన పరీక్షిన్మహారాజును నిమిత్తంగా చేసుకొని, ఈనాడు శుకయోగీంద్రుడు పద్ధెన్మిదివేలశ్లోకాల భాగవతాన్ని ఉపదేశించినాడు. ఆత్మతత్త్వ ప్రతిపాదకాలైన ఆరెండు గ్రంథాలను రచించి, వ్యాసభగవానుడు కృతకృత్యుడైనాడు. ఆస్వాదిస్తూ మానవజాతి తరిస్తోంది.

పిబరే రామరసం

యర్రమిల్లి విజయలక్ష్మి, తణుకు, 9492007836

'పుత్రులచే లోకాలను జయించు. పౌత్రులచే అనంత సుఖాలు అనుభవించి, ప్రపౌత్రుని వలన స్వర్గాన్ని అధిరోహించుమని శాస్త్రం. అయితే సమస్త సంపదలతో తులతూగే శౌర్యవంతుడైన దశరథుడు సంతానంకోసం దుఃఖించగా ఋష్యశృంగమహర్షి సంతానం కలిగేటట్లు సంకల్పించాడు. ఆ మహాఋత్విక్కు భక్తితో హవిస్సులివ్వగా అగ్నిదేవుడు హవిష్యాన్నాన్ని ప్రసాదించాడు. 'ఈయజ్ఞప్రసాదాన్ని నీపట్టపురాణులకు వారియోగ్యతను, అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని పంచిపెట్టు' అన్నాడు. పాయసంలో అర్థభాగాన్ని కౌసల్యకు – మిగిలిన దానిలో అర్థభాగాన్ని సుమిత్రకు – మిగిలిన దానిలో అర్థభాగాన్ని కైకేయకు ఇచ్చి, ఇంకా మిగిలిన దాన్ని సుమిత్రకు ఇచ్చాడు దశరథుడు. వాల్మీకి రామాయణాన్ని అనుసరించి శ్రీమహావిష్ణువు తనను నాలుగు భాగాలుగా చేసికొని దశరథునిలో ప్రవేశించాడు. శ్రీమహావిష్ణువు స్వయంగా శ్రీరాముడుగా అవతరించాడు. శ్రీదేవి జానకి అయింది. ఆదిశేషువు లక్ష్మణుడుగాను, శంఖం భరతుడుగాను, చక్రం శత్రుఘ్నుడుగాను అవతరించారు.

తామస రాక్షస దేహంతో సాత్త్విక సాధనలుచేసి, తనను చేరుకోలేని అసురులను సంహరించి, ముక్తినిచ్చి లోకహితం చేసే పరమాత్మ రావణాది రాక్షసవధ నిమిత్తం దశరథ తనయుడుగా రూపొందాడు.

'ఆనందరూపో నిష్పరిమాణ ఏష లోకైశ్వైతస్మాద్రమతే తేన రామః'

ఆనందరూపుడు, పూర్ణుడు, లోకరమణుడు అయినందు వలన రాముడన్నారు.

'ఇతనికి అనుపమానమైన నామాలెన్నో ఉన్నాయి. అయినను నా బుద్ధికి అనురూపమైన నామమిది...

'ఏ పరమానంద అమృతసాగరబిందు మాత్రాన ముల్లోకాలు ఆనందం పొందుతాయో – ఆ అఖిలలోక కల్యాణ కారకుడు, సుఖధాముడు అయిన ఈ శిశువుకు రామనామం ఎంతో ఒప్పుతుంది' అని వశిష్ఠుడు పరమాత్మకు నామకరణం చేస్తాడు. జగత్తును సృష్టించి అందులో ప్రవేశించినవాడనీ, విశేషంగా వ్యాపించే వాడనీ శ్రీరాముణ్ణి 'విశ్వం' అనే పేరుతో కూడా పిలుస్తారు. 'విశ్వం విష్ణుః'.... 'రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్న నామరూపాలు కలిగి అసురులకు తగినరీతిలో హితంచేసే పరమాత్మ....! మీరే సంపూర్ణంగా సంసారంలో వ్యాపించి ఉన్నారు. ఓ లక్ష్మీపతీ! మీరు రావణాదుల సంహారం కోసం ఈ రూపాన్ని ధరించారు' అని వేదమాత ఋగ్వేదంలో ఆ పరమాత్మ నామరూపాలలోని నిగూఢతత్త్వాన్ని సూచించింది.

లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు ముగ్గురూ జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలు. వీరు తురీయబ్రహ్మమైన రాముని యొక్క అంశలు. అయితే ఇవి అంశలుగా కన్పించినా అంశలుకావని – ఈ మూడు అవస్థలకు లోనయ్యేవ్యక్తి ఒక్కడేనని – ధ్యానంలో సమాధి నిష్ఠుడైనప్పుడు – వీటి కతీతుడై, తన మూలస్థితికి చేరుకుంటాడని వేదం వివరించింది. ఈ మూడింటినీ సమర్పించి శరణాగతి పొందినప్పుడే పూర్ణత్వం సిద్ధిస్తుందనే సత్యాన్ని చెప్పటానికే శ్రీమహావిష్ణువు ఒకేసారి నాలుగు అంశాలుగా – నాలుగు రూపాలలో అవతరించాడు.

సకలపాపాలను పోగొట్టి ఐహికాముష్మిక సంపదలనిచ్చేది – శాశ్వత బ్రహ్మానందమును ప్రత్యక్షముగా కలిగించి ఉపాసకులను తరింపచేసేది – జనన మరణ దుఃఖరూపమైన సంసారమును నివర్తించేసేది – ఏదో ఆ మహామంత్రాన్ని బోధించమని ఒకసారి పార్వతీదేవి పరమశివుణ్ణి కోరింది. శంకరుడు, పార్వతీదేవి యందు




ప్రీతికలవాడు అయిన పరమశివుడు అతిగోప్యం, తన నిక్షేపం అయిన రామతత్త్వాన్ని ఉపదేశించాడు.

'శ్రీమనోరామ శ్రీరామ రామ రామ
యనుచు రమియింతు రామునియందు రామ
నామము వరానన! సహస్రనామ తుల్య
మట్లు గావున దీనిని అవధరింపు'

అజ్ఞానాంధకారాన్ని పోగొట్టటానికి ఈరామమంత్రం మహాశ్రేష్ఠమైంది. శ్రీరామ రామ రామ అనే దివ్యనామం విష్ణుదేవుని సహస్రనామావళితో, సమానమైంది. నేను ఈరామనామ మంత్రమందే క్రీడించువాణ్ణి. కనుక, ఈ రామతారక దివ్యమంత్రాన్ని నిరంతరము జపించు. పరబ్రహ్మను తెలియచేసేదీ, ప్రపంచానికి ఆదియైనదీ. అత్యంత పరమ పావనమైన శ్రీరామమంత్రం ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధ పురుషార్థాలనిచ్చే దివ్యమంత్రం, జ్ఞానస్వరూపం, ఆనంద స్వరూపం, జీవాత్మకు వేరుకాని పరమాత్మ, పరబ్రహ్మ స్వరూపమై బ్రహ్మాదిదేవతలు నిరంతరం ధ్యానించేది అయినందువల్ల 'రామ' అనే పేరు కలిగింది. రమింపచేయువాడు కనుక రాముడు.

రామనామజపం నశింప చెయ్యలేని పాపమేదీ ఈ పద్నాల్గు లోకాలలో ఎక్కడా ఉండదు. మహాఘోరమైన పాపాలన్నీ రామమంత్ర జపంవల్ల నిమిషమాత్రంలో తొలగిపోతాయి. పాపాలన్నీ రామమంత్రమంటే భయపడతాయి.

చరితం రఘునాథస్య శతకోటి ప్రవిస్తరమ్
ఏకైక మక్షరం పుంసాం మహాపాతక నాశనమ్.



రఘువంశనాథుడై శ్రీరాముని చరిత్ర నూరుకోట్ల శ్లోకాలతో కూడి ఉంది. దీనిలోని ఒక్కో అక్షరం మహాపాపాలను పోగొట్టే శక్తి కలిగిఉంది. ముల్లోకవాసుల కోరిక మేరకు శివుడు ఒక్కొక్క లోకానికి 33 లక్షల 33 వేల 33 శ్లోకాల చొప్పున పంచాడు. చివరగా 32 అక్షరాల శ్లోకం మిగిలితే దాన్ని సమంగా పంచగా చివర అక్షరాలు ఎవరికీ పంచక తనదగ్గరే ఉంచుకొన్నాడనీ ఆ రెండక్షరాలే రామ మహామంత్రంగా – శివుడు రమించే తారకమని పురాణగాథ. రామాయణంలోని ఒక్కో అక్షరం మహాపాతకాలను పోగొట్టే దివ్యమంత్రం.

ఆనంద సుఖరాశీ సీకరతే త్రైలోక సుపాసీ
సోసుధామరామ షసనామా అఖిలలోక దాయిక విశ్రామ

ఆనందసముద్రం సుఖరాశి

ఆనందసాగరంలోని ఒక్కొక్క బిందువుచేత మూడులోకాలకు సుఖాన్ని ప్రసాదించేవాడు అయిన సుఖధాముడికి రాముడని పేరుంది. ఈ శిశువు మూడులోకాలకు విశ్రాంతి నీయగలడు.

అగ్ని సూర్యచంద్రులకు హేతువై, త్రిమూర్తిరూపమై, వేదాలకు ప్రాణమై, నిర్గుణమై, నిరుపమానమై, గుణభాండారమై వున్న రామనామానికీ వందనమంటాడు తులసీదాస్.

'ర' కారం అగ్నిబీజం, దానిలో త్రేతాగ్నులున్నాయి. దీన్ని మననం చేస్తే శుభాశుభరూపమైన మనోమాలిన్యాలను పోగొడుతుంది.

'అ' కారం సూర్యబీజాక్షరం. సమస్త జ్ఞానాన్నీ ప్రకాశింపచేసి, అవిద్యాంధకారాన్ని పోగొడుతుంది. 'మ' కారం చంద్ర బీజాక్షరం. దీనిలో అమృతం నిండి ఉంది. ఆధిదైవిక, ఆధిభౌతిక, ఆధ్యాత్మిక తాపాలను తొలగించి, శీతలత్వాన్ని, శాంతిని కలిగిస్తుంది. అందువల్లనే రామనామం సోమసూర్యాగ్నులను మించిన స్వప్రకాశంగా భావించబడుతోంది. ఎవరివల్లనైతే యావత్తుజగత్తు చైతన్యం, శాంతినీ పొందుతుందో, ఆ శాంతి అగ్నిలోని తేజం నేనేనని తెలుసుకో అంటాడు పరమాత్మ స్వయంగా. 'ర' రజస్సు, 'అ' సత్త్వం, 'మ' తమస్సు అనే త్రిగుణాలకు మూలమైంది రామనామం. "రామ అనే మంత్రాన్ని పదునెనిమిదిసార్లు స్మరించినవారికి జనన మరణ రహితమైన మోక్షం కలుగుతుంది" – అన్నాడు శివుడు.

హరేరామ హరేరామ రామరామ హరేహరే
హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే

ఈ నారాయణనామస్మరణవల్ల సకలపాపాలనుండి విముక్తులై మోక్షం పొందుతారని చెప్పబడింది. కలియుగంలో భక్తికీ, భుక్తికీ, ముక్తికీ రామనామమే తరుణోపాయం!!

పెరియాళ్వార్ వైభవం

కె. లావణ్య, విశాఖపట్నం, 9052836164

**గురుముఖ మనధీత్య ప్రాహ వేదా నశేషాన్
నరపతిపరిక్లప్తం శుల్క మాదాతుకామః।
శ్వశుర మమర వంద్యం రంగనాథస్య సాక్షాత్
ద్విజకులతిలకం తం విష్ణుచిత్తం నమామి॥**

భారతీయ భక్తివాఙ్మయ నందనోద్యాన వనంలో భగవదంశ సంభూతులుగా అవతరించినవారు – ఆళ్వార్లు. భగవంతుని గుణసాగరంలో మునిగి, అందులోని లోతును కనిపెట్టినవారు కాబట్టి వీరు 'ఆళ్వార్' పదవాచ్యులయ్యారు.

భూలోకవాసులకు కీర్తన భక్తిద్వారా మోక్షాన్ని అనుగ్రహింప తలచి, తన ఆయుధాలను నిత్యసూరుల ఆళ్వారుల రూపంలో అవతరింపచేసి, తన కల్యాణగుణాలను, లీలలను వర్ణిస్తూ నాలుగువేల పాశురాలుగా వారిచే గానం చేయించారు శ్రీమన్నారాయణుడు.

పెరియాళ్వార్ల అవతారం

పాండ్యదేశంలో 'శ్రీవిల్లిపుత్తూర్' అనే గ్రామంలో జ్యేష్ఠమాసం, స్వాతీనక్షత్రంలో గరుడాంశలో వీరు జన్మించారు. ముకుందార్యుడు, పద్మైయమ్మన్ అనే పుణ్యదంపతులు వటపత్రశాయిని పలురీతులుగా ప్రార్థించగా, వటపత్రశాయి అనుగ్రహంతో వారికోరిక ఫలించింది.

జ్యేష్ఠమాస – శుక్లపక్ష ఏకాదశి – భానువారంనాడు ఒక పండంటి బాబు ఉదయించాడు. పుట్టినప్పటినుండి సదా విష్ణువునే మనసులో ధ్యానించడంవల్ల ఆ పుణ్యదంపతులు ఆ శిశువుకు 'విష్ణుచిత్తుడ' అని నామకరణము చేశారు.

పెరియాళ్వార్ల ఇతరనామాలు

గురుపరంపరాప్రభావం, దివ్యసూరి చరితం మొదలగు గ్రంథాలను పరిశీలిస్తే పెరియాళ్వార్లకు విష్ణుచిత్తయోగి, భట్టనాథముని, భట్టముని, స్వాతియోగి, గరుడాంశయోగి, శుల్కముని, కనకశుల్కముని, పరతత్త్వస్థాపకయోగి, గోదా జనకముని, విష్ణుమతస్థాపనాచార్యుడు, ధన్విపురయోగి మొదలగు పేర్లున్నాయి.

పుష్పకైంకర్యం

వీరు పవిత్రభావంతో తమ ఊరిలో వెలసిన వటపత్రశాయి స్వామికి నిత్యం తులసిమాలా కైంకర్యం, పుష్పమాలల సమర్పణ చేసేవారు.

పాండ్యరాజు వల్లభదేవుడు

శ్రీవిల్లిపుత్తూరుకు సమీపంలో పాండ్యదేశాన్ని పరిపాలించే వల్లభదేవుడు మారువేషంలో వీధిలో సంచరిస్తూ, ఒక ఇంటిఅరుగుపై పడుకొని ఉన్న వ్యక్తిదగ్గరకు వెళ్లి, ఆయన వివరాలను తెలుసుకొని, ఏదైనా ఒక మంచి శ్లోకాన్ని వినిపించుమని కోరారు. దానికి ఆవ్యక్తి తత్త్వాన్ని గురించి ఇలా తెలియజేశారు.

**వర్షార్థమష్టౌ ప్రయతేత మాసాన్,
నిశార్థ మర్థం దివసే యతేత।
వార్ధక్యహేతోః వయసా నవేన,
పరత్ర హేతోః ఇహ జన్మనా చ॥**

వర్షాకాలంలో అవసరమైనవి మిగిలిన ఎనిమిది మాసాలలో సంపాదించాలి. రాత్రికి కావలసిన వస్తువులు పగలే సంపాదించాలి. వార్ధక్యదశలో అవసరమైనవి వయస్సులో ఉన్నప్పుడు సాధించాలి అని శ్లోకార్థం.

ఈశ్లోకం వల్లభదేవుణ్ణి ఎంతగానో ఆలోచింపచేసింది. ఈ శ్లోకంలోని ఆంతర్యాన్ని గ్రహించినరాజు "ఇంతకాలం వ్యర్థం చేశానే, ఇకనైనా



జూన్ 18 శ్రీ పెరియాళ్వార్ల ఉత్సవారంభం

పరమార్థతత్త్వాన్ని తెలుసుకోవా" లని తలచి పరతత్త్వనిరూపణకై వేద–వేదాంత వేత్తలగు పండితులను పిలిపించాలని తలచాడు. రాజాస్థానంలోనే సంపదుడనే పురోహితుని సూచన ననుసరించి, తన సభామధ్యంలో బంగారు నాణేలరాశిని వ్రేలాడగట్టి, రాజుగారి సందేహాన్ని నివారింపచేసి, పరతత్త్వనిరూపణ చేసేపండితులకు బంగారంతోపాటు తగిన సన్మానం చేస్తారని చాటింపు వేయించారు. దేశనలుమూలలనుండి సకలశాస్త్ర పండితులు సభకు వచ్చిచేరారు. వచ్చినవారు ఒకరికొకరు పరస్పర మతదూషణలతో, మిథ్యా వివాదాలతో పరతత్త్వాన్ని నిరూపించలేకపోయారు.

పాండ్యరాజుసభకు వెళ్లుమని స్వామిఆదేశం

ఆ సమయంలో వటపత్రశాయిస్వామి విష్ణుచిత్తులతో 'పాండ్యరాజుసభకు వెళ్లి, బంగారాన్ని తీసుకోవలసిందిగా ఆజ్ఞాపించారు'.

ఏమీ తెలియనివారైన విష్ణుచిత్తులు, వేదవేదాంతాది శాస్త్రాలు గురువుద్వారా అభ్యసించనందున వేదవేదార్థంద్వారా పొందదగిన కనకశుల్కం కేవలం తోటమాలి అయిన తాను ఎలా పొందగలనని స్వామిసన్నిధిలో విచారంలో ఉన్నారు. అపుడు స్వామి "నీహృదయకమలంలో నేనుఉండి సకలప్రమాణ సిద్ధాంతార్థాలను పలికిస్తా" నన్నారు.



పరతత్త్వస్థాపన – పెరియాళ్వార్ల అనర్గళవాక్పటిమ

విష్ణుచిత్తులు పాండ్యరాజుసభకు వెళ్లి–

సర్వార్థా వేదగర్భస్థా వేదశ్చాష్టాక్షరే స్థితః ।
అష్టాక్షర స్తు ప్రణవే అకారే ప్రణవః స్థితః ॥
నారాయణత్పరో దేవో న భూతో న భవిష్యతి ।
ఏతద్రహస్యం వేదానాం పురాణానాం చ సమ్మతమ్ ॥

సత్యం సత్యం పున స్సత్యం ఉద్ధృత్య భుజ ముచ్యతే ।
వేదశాస్త్రాత్ పరం నాస్తి, న దైవం కేశవాత్ పరం ॥

సర్వపదార్థాలు వేదంలో ఇమిడి ఉన్నాయి. వేదం అష్టాక్షరీమంత్రంలో ఉంది. అట్టి అష్టాక్షరి ప్రణవంలోను, అందలి అకారంలో ప్రణవం ఉంది కనుక నారాయణుడే పరదైవం! నారాయణుణి మించిన దైవం లేదు.

మొదలగు అనేక ప్రమాణాలచే విష్ణుపారమ్యాన్ని నిరూపించారు. ఈ మాటలమధ్య స్తంభానికి కట్టిన బంగారు నాణేలమూట తనంతట అదే వీడి, విష్ణుచిత్తుల పాదాలపై పడింది.

పెరియాళ్వార్ విజయం – దేవతల ఆమోదం

పెరియాళ్వార్ల విజయాన్ని దేవతలుసైతం పుష్పవృష్టితో అభినందించారు. వల్లభదేవుడుకూడా సంతోషించి, ఘనంగా సన్మానించాడు.

గజారోహణసన్మానం

విష్ణుచిత్తుల విజయాన్ని ప్రతిఒక్కరు నోరార పొగడ్తున్న సందర్భంలో రాజు విష్ణుచిత్తుణ్ణి గజారోహణం కావించి, ఘనంగా ఊరేగిస్తుండగా, తన అంతరంగ భక్తునికి లోకం నీరాజనం పట్టడాన్ని నేరుగా చూచి, ఆనందించడానికై శ్రీమన్నారాయణుడు గరుత్మంతుణ్ణి అధిరోహించి, స్వయంగా ఆకాశమార్గంలో రాగా – స్వామిని చూచి, భక్తిపారవశ్యంతో తాను అధిరోహించి ఉన్న ఏనుగులకు కట్టబడిన చిరుగంటలను వాద్యాలుగా చేసుకొని, స్వామిని తనివితీరా దర్శిస్తూ కీర్తించసాగారు.

మంగళాశానం – పల్లాండు పల్లాండు

అనేక ఆభరణాలతో, శంఖచక్రాది ఆయుధాలతో, లక్ష్మీచరణలాక్షాంక వక్షస్థ్సుడై విచ్చేసిన స్వామిని –

పల్లాణ్డు పల్లాణ్డు పల్లాయిరత్తాణ్డు
పలకోటి నూరాయిరమ్

మల్లాణ్ణ తిణ్‌తోళ్ మణివణ్ణా, ఉన్
శేవడి శెవ్వి తిరుక్కాప్పు

అనేకవేలకోట్ల సంవత్సరాలు స్వామిమంగళంతో వర్ధిల్లుగాక! అని స్వామిని పాదాదికేశపర్యంతం దర్శిస్తూ ప్రతి భాగానికి, ఆయుధానికి, అలంకరణకు, పరాక్రమానికి, కల్యాణ గుణాలకు, వక్షఃస్థలనిత్యనివాసియైన మహాలక్ష్మి అమ్మవారికి... ఎప్పుడు ఏవిధమైన ఇబ్బందిరాకూడదనీ, సుకుమారమైన స్వామివారి శ్రీపాదాలసౌందర్యానికి నిరవద్యమైన రక్ష కలగాలనీ, నిత్య సముజ్జ్వలమై విరాజిల్లాలని మంగళాశాసనం కీర్తించారు.

రచించిన ప్రబంధములు

1. తిరుప్పల్లాండు - ఇది 12 పాశురాల ప్రబంధం. గరుడగమనుడైన భగవంతుణ్ణి గురించి మంగళాశాసన పూర్వకంగా గానం చేయబడిన మధురగీతాలు. భక్తులైనవారు తమ జీవితాన్ని భగవత్సేవయందే గడపడం శ్రేయస్కరమనే దివ్యసందేశాన్ని పెరియాళ్వారులు ఈ ప్రబంధంద్వారా లోకానికి చాటిచెప్పారు. నాలాయిరదివ్యప్రబంధంలో 'తిరుప్పల్లాండు' కు విశిష్టస్థానముంది. శ్రీవైష్ణవుల నిత్యానుసంధానంలో తిరుప్పల్లాండు తప్పనిసరి కూడా!

2. పెరియాళ్వార్ తిరుమొళి - ఇందు 461 పాశురాలున్నాయి. బాలకృష్ణునియొక్క మధురలీలలు మనోహరంగా వర్ణించి ఉన్నాయి. ప్రత్యేకించి ఇందులో పెరియాళ్వారు ప్రదర్శించిన వాత్సల్యభావం అద్భుతంగా, మనోజ్ఞంగా కనిపిస్తుంది.

పెరియాళ్వార్ పేరుకు కారణం

పంద్రెండు ఆళ్వారులలో వీరికే పెరియాళ్వార్ అనే పేరు ఏర్పడటానికి గల కారణాన్ని పరిశీలిస్తే, వీరు వరుసక్రమంలోను మొదటివారు కాదు. మిగిలిన ఆళ్వారులకన్న ఎక్కువ పాశురాలను కీర్తించినవారుకూడా కాదు. జ్ఞానాధికులా అంటే ఏగురువువద్ద విద్యాభ్యాసం చేసినవారు కాదు. ఈ సందర్భంలో వీరినే పెరియాళ్వార్ అనడానికి కారణం-

1. భగవంతునికి మంగళాశాసనం చేసిన ఆళ్వారు కనుక,

2. తాను పెంచి పెద్దచేసిన, 'గోదామహాలక్ష్మి'ని స్వామికి సమర్పించి, స్వామికి మామగారి స్థానాన్ని పొందారు కనుక వీరికి పెరియాళ్వార్ అనే పేరు సార్థకమైంది.

వాత్సల్య రంజిత భక్తిభావం హృదయంలో కొలువుండటం చేత భగవంతునికి మంగళాశాసనం చేసేతలంపు కలిగింది.

తిరుపతిలో గజవాహనసేవ

వీరి అవతార తిరునక్షత్రంనాడు తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిఉన్న



పెరియాళ్వారులకు గజవాహనసేవ చేయుట జరుగుతూంది. పెరియాళ్వారు గజవాహనంలో గరుత్మంతునిపై ఊరేగే స్వామికి అభిముఖంగా స్వామిని సేవిస్తూ, మంగళాశాసనం కీర్తిస్తూ ఊరేగుతారు. ఈ దృశ్యం ఆనాడు పాండ్యరాజసభలో పరతత్త్వ నిర్ణయ విజయంలో జరిగిన గజారోహణ సందర్భాన్ని కళ్లకు కట్టినట్లు దర్శనభాగ్యాన్ని కలుగజేస్తుంది.

విద్య సౌందర్యాన్నిస్తుంది!
అది ఎవ్వరూ దోచుకోలేని అపార ధనాగారం!
విద్యవల్ల కీర్తి, సంపద, ఆనందం లభిస్తాయి!
విద్య గురువులకు గురువు!
అన్యప్రదేశాల్లో విద్య బంధువులా సహాయం చేస్తుంది!
పాలకులవద్ద గౌరవం లభించేలా చేస్తుంది.
విద్యలేనివాడు వింత పశువు.



సందేహాలు? సమాధానాలు!!

విద్వాన్, డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య,
పూర్వకార్యదర్శి, హిందూధర్మప్రచార పరిషత్తు, తి.తి.దే.
చరవాణి : 09848111794, తిరుపతి

ఊర్ధ్వపుండ్రాలు, తిర్యక్ పుండ్రాలు అంటారే - వాటి అర్థవిశేషాలు తెల్పండి.

- కె. రామాచార్యులు, కర్నూలు

సమా॥ పుండ్రమంటే నలుపు గలసిన ఎర్రచెరకు, తెల్లదామర, నుదుటినామం, పువ్వుల గురివెంద మొదలైన అర్థాలున్నాయి. ప్రస్తుతం 'నుదుటినామం' అనే అర్థంలో నామధారులు వాడుతున్నారు. 'పుణ తీతి పుండ్రః – పుణ శుభకర్మణి' – శుభాన్ని కల్గించేది అని వ్యుత్పత్తి. చెరకు అనీ అర్థం ఉంది. అంటే చెరకుగడ. నుదుటినామం శుభసంకేతం. నామం ఉంటే ఆ యింట శుభంగా, సంతోషంగా అందరూ ఉన్నారని భావించాలి. నామం లేకపోతే అమంగళం.

పుండ్రం – రెండు విధాలు 1) తిర్యక్‌పుండ్రం 2) ఊర్ధ్వపుండ్రం. నుదట అడ్డంగా మూడుగీతలు చెరకుగడలవలె ఉండడం – తిర్యక్ పుండ్రం. చెరకుగడవలె నుదుట నిలువుగా మూడుగీతలతో ఉండడం ఊర్ధ్వపుండ్రం. తిర్యక్ అంటే అడ్డంగా, ఊర్ధ్వమంటే నిలువుగా అని అర్థాలు.

తిర్యక్‌పుండ్రాన్ని శివుడు, ఊర్ధ్వ పుండ్రాన్ని విష్ణువు – ఎప్పుడూ ధరించి ఉంటారు. శివకేశవులు పుండ్రధారులు కనుకనే వారిని పూజించేవారుకూడా ఆవిధమైన పుండ్రధారులై పూజించాలని శాస్త్రాలు పేర్కొన్నాయి. "నారుద్రో రుద్ర మర్చయేత్" తాను రుద్రుడు కాక – రుద్రుణ్ణి పూజించరాదు. "నావిష్ణుః విష్ణు మర్చయేత్" తాను విష్ణువు కాక విష్ణువును పూజించరాదు – అనడం విధి. అంటే శివార్చకులు శివునివలె, తిర్యక్‌రేఖలు విబూదితో ధరించాలి. విష్ణుఅర్చకులు విష్ణువువలె ఊర్ధ్వపుండ్రాలు ధరించాలి. అంటే ఏదేవుణ్ణి పూజిస్తుంటే ఆ దేవునితో సారూప్యం చెంది, పూజించాలనేది ఇందలి ఆంతర్యం! అర్చనలో అర్చకులు పుండ్రధారణ చేయడమనేది ఒక ముఖ్యభాగం. ఇందువల్ల తనరూపాన్ని తాను చూచుకొన్నపుడంతా తాను విష్ణు / శివ అర్చకుణ్ణి అనే దృఢమైన నిష్ఠ ఏర్పడుతుంది. ముందుగా భౌతికనిష్ఠ దృఢపడితే – పిదప ఆంతరంగికనిష్ఠ క్రమంగా కుదురుకొంటుంది. భక్తులకుకూడా అర్చకునిరూపాన్ని చూడగానే ఇతడు విష్ణుదేవుని / శివదేవుని కైంకర్యపరుడు అనే భావన, గౌరవం ఏర్పడుతుంది. కనుక ఆయా సంప్రదాయాలవారు తమకు శాస్త్రం విధించిన పుండ్ర (నామ) ధారులై ఆయా దేవతల్ని అర్చించి, తరించాలి.

శివసహస్రనామావళిలో "ఓం పినాకధృతే నమః" అని ఉంది. అర్థం వివరించగలరు.

- సిహెచ్. విజిత, తిరువూరు, కృష్ణాజిల్లా

సమా॥ పినాకమనేది శివుని ధనుస్సుపేరు. పినాకాన్ని – 'ధృత్' = ధరించడం – పినాకాన్ని ధరించినవాడు కనుక శివునికి 'పినాకధృత్' అని పేరు. 'ధృత్' అనేది చతుర్థీవిభక్తి ఏకవచనంలో 'ధృతే' తాల్చినవానికొరకు అని అర్థం. నిరాకారశుద్ధ పరమాత్మకు 'ఓం' కారం సంకేతం. అట్టి నిరాకారపరమాత్మ సాకారుడై శివుడుగా ఉన్నాడు. కనుక పరమాత్మ – నిరాకారం నుండి సాకారమైన 'పినాకాన్ని ధరించినవాడుగా ఉన్నాడు – అట్టివానికి అంటే శివునికి నమస్కారం! అని అర్థం.

శివసహస్ర నామావళిలో 'పినాకధారణ' విషయం రెండుచోట్ల వస్తుంది. 75 శ్లో. 137 శ్లో. మొట్టమొదటి కృతయుగంలో కణ్వుడనే ముని తపస్సు చేయగా, అతనిపై పుట్టలు పెరిగాయి. అందుండి ఒక గొప్ప వెదురు వెలువడింది. అప్పుడు బ్రహ్మ ఆ మునికి ప్రత్యక్షమై – ఆ వెదురు పుచ్చుకొని, దానితో మూడు విండ్లు (ధనుస్సులు) తయారుచేసి, శివునికి ఒకటి, విష్ణువుకు ఒకటి ఇచ్చి, తానొకటి తీసుకొన్నాడు. శివుని విల్లు పినాకం, విష్ణువు విల్లు శార్ఙ్గం, బ్రహ్మవిల్లు గాండీవం (పూర్వగాథలహరి – వేమూరి శ్రీనివాసరావు).

పినాకమంటే – త్రిపురదహనకాలంలో బాణజ్వాలలతో స్వర్గాన్ని కప్పింది. – అని వ్యుత్పత్తిని గురుబాల ప్రబోధిక ఇచ్చింది. 'రక్షించేది' అనీ వ్యుత్పత్తి అందే ఉంది. పినాకమంటే త్రిశూలమనే అర్థమూ ఉంది.

కుబేరుని వృత్తాంతం దయతో తెల్పండి.

– నోరి వేంకటేశ్వరరావు, శ్రీకాకుళం

సమా॥ కుబేరుడు అష్టదిక్పాలకులలో ఒకడు. ఇతడు ఉత్తర దిక్కుకు అధిపతి. ఇతని పట్టణం అలకాపురి. భార్య చిత్రరేఖ. వాహనం గుర్రం. (నరవాహనుడనే ప్రసిద్ధీ ఉంది). ఆయుధం – ఖడ్గం. ఇతడు ఐశ్వర్యానికి దేవత. ఇతని రాజాధిరాజత్వం వేదప్రసిద్ధం కనుక ఇతనికి 'రాజరాజు' అనీపేరు. ఇతడు యక్షకులకు, గుహ్యకులకు రాజు. విశ్రవసునికి ఇలబిలయందు పుట్టినవాడు. కనుక ఇతనికి 'ఐలబిలుడు' అనీ పేరు. పార్వతీదేవిశాపంవల్ల ఇతడు ఏకపింగాక్షుడయ్యాడు. కారణం – ఒకమారు పార్వతి శివునితొడపై కూర్చొని ఉండగా కుబేరుడు ఈర్ష్యతో చూచాడు. పార్వతి గమనించి, ఇతని కన్ను పోయేటుగా శాపమిచ్చింది. కుబేరుడు క్షమాపణ కోరగా – ఆ కన్ను గవ్వకన్నుగా మారుతుందని విమోచనం తెల్పింది.

కుబేరుడు బ్రహ్మనుగూర్చి తపస్సు చేయగా బ్రహ్మ ప్రత్యక్షమై వరం కోరుకొమ్మనగా – సంపదకు అధిపతిత్వం కోరాడు. బ్రహ్మ అనుగ్రహించాడు. తండ్రి విశ్వవసోబ్రహ్మ ఇతనికై దక్షిణసముద్రంలో లంకానగరాన్ని నిర్మించగా – అందు కుబేరుడు నివసిస్తూ వచ్చాడు. బ్రహ్మ పుష్పకవిమానాన్నికూడా ఇతనికి ఇచ్చాడు. రావణుణ్ణి కుబేరుడు మందలించినందుకై – రావణుడు కోపించి, కుబేరునిపై దండెత్తి జయించి, అతనినగరాన్నీ, పుష్పకవిమానాన్నీ గైకొన్నాడు. చివరకు రావణవధానంతరం – తానూ, తనవారినందరినీ అయోధ్యకు చేర్చాక, పుష్పకాన్ని కుబేరుడికే ఇచ్చాడు – రాముడు.



సంజయుని గురించిన వివరాలు తెలుపగలరు.

– సాయిరామానందస్వామి, పొదలకొండపల్లి, ప్రకాశంజిల్లా

సమా॥ సంజయుడు ధృతరాష్ట్రుని మంత్రి. ఋషితో సమానుడు. ఇతడు సూతుడు. గవల్గనుడి శరీరభాగంనుండి జన్మించాడు. వ్యాసునివరంవల్ల కురుక్షేత్ర సంగ్రామవిశేషాలు యథాతథంగా – అక్కడివారి మనోభావాలతోకూడా – ధృతరాష్ట్రునికి వివరించాడు. దుర్యోధనుని మరణానంతరం సంజయునికి ఆ అంతర్దృష్టి పోయింది.

సంజయుడు ధర్మజుని రాజసూయ యాగంలో అతిథులను ఆహ్వానించాడు. పాండవులు అరణ్యవాసంకు వెళ్లినపుడు కౌరవులపై కోపంతో విదురుడు పాండవులతో వెళ్లగా – ధృతరాష్ట్రుని కోరికపై సంజయుడు వెళ్లి, విదురుణ్ణి తిరిగి తీసుకొనివచ్చాడు. ధృతరాష్ట్రునికి పాండవుల ప్రతిజ్ఞలను గురించి, సహాయకుల్నిగురించీ వివరించాడు. శ్రీకృష్ణుని గొప్పతనాన్ని వివరించాడు. సాత్యకి సంజయుణ్ణి బంధించగా, వ్యాసుని ఆశీస్సులతో బయటపడ్డాడు. జీవితం తుదిదశలో గాంధారీ ధృతరాష్ట్రులతో పాటు అరణ్యానికి వెళ్లాడు. అక్కడ ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతి మరణించగా – ఆవిషయాన్ని గంగాతీరంలోని ఋషులకు వివరించాడు. ఇతడు కౌరవుల పక్షంనుండి – పాండవులవద్దకు రాయబారిగానూ వచ్చాడు. చివరకు హిమాలయాలకు వెళ్లాడు.

అన్నమయ్య అనన్యభక్తి - లోక విరక్తి

డా॥వి.పళని, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ద్రావిడవిశ్వవిద్యాలయం, కుప్పం, 9912343804



భగవత్సేవారతి భక్తి. శ్రీమచ్ఛంకర భగవత్పాదులు తమ 'వివేక చూడామణి' లో

"మోక్షసాధన సామగ్ర్యాం భక్తిరేవ గరీయసీ।

స్వస్వరూపానుసంధానం భక్తిరిత్యభిధీయతే॥"

– అని భక్తి విశిష్టతను స్పష్టంగా చెప్పారు.

వివేకం

భక్తి, విరక్తులకు మూలం వివేకమే. ఈ విషయాన్నే ప్రస్తావిస్తూ అన్నమయ్య, హరిమాయలో చిక్కిన జీవుని స్థితిని

"ఏదీ తుద దీనికేది మొదలు

పాదుకొను హరిమాయఁబరగు జీవునికి"

(అధ్యా.సంకీ, – 102, సంపు.1)

అనే సంకీర్తనలో చక్కగా అవిష్కరించారు.

అనన్యభక్తి

పతివ్రతకు భర్తపైగల నిబద్ధతకంటే అధికమైననిబద్ధత భక్తునికి భగవంతునిపై ఉంటుంది. భక్తుడు లౌకిక భావనకు అందని ఆత్మనివేదనకూడా ఆచరిస్తాడు. పతివ్రతామతల్లులకు లౌకికంగా పతియే దైవమైనప్పటికీ అలౌకిక విషయాలకు హరిశరణాగతి అనివార్యం. మనసా, వాచా, కర్మణా ఒక ఇల్లాలు తన పతిని తప్ప వేరొకరిని భావించనట్లు – భక్తుడు తన ఇష్టదైవాన్నే సర్వకాల సర్వావస్థల్లోను విశ్వసించి జీవించడమే అనన్యభక్తి. అన్నమయ్య ఎందరు అర్చామూర్తులపై సంకీర్తనలు చెప్పినప్పటికీ ఫలశ్రుతిని వేంకట ముద్రాంకితం చేసి, తన అనన్యభక్తిని చాటుకొన్నాడు.

అన్నమయ్య అనన్యభక్తి శ్రీనివాసునిమీదనే! ఈ శ్రీనివాసుడే పరబ్రహ్మం. ఈ స్వామినే పలువురు పలువిధాలుగా దర్శిస్తున్నారు, భావిస్తున్నారు. భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ 'యే యథా మాం ప్రపద్యన్తే తాం స్తథైవ భజామ్యహమ్' అని స్పష్టంచేసి చెప్పాడు.

శ్రీనివాసుడు సకల దేవతామూర్తి

అన్నమయ్య తన దైవమైన శ్రీ వేంకటేశ్వరుడే సకల దేవతా స్వరూపుడనీ, సర్వాత్ముడనీ స్థిరవిశ్వాసంతో

ఎంత మాత్రమున నెవ్వరు దలచిన, అంత మాత్రమె నీవు

అంతరాంతరము లెంచి చూడఁ బిండంతే నిప్పటి యన్నట్లు -

కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుడని

పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మంబనుచు

తలఁతురు మిము శైవులు తగిన భక్తులును శివుఁడనుచు

అలరి పొగడుదురు కాపాలికులాది భైరవుండనుచు

అనే కీర్తనలో తెలియజేశాడు. ఈ సందర్భంలో వివిధ దర్శనాలను వివరించిన తీరు అన్నమయ్య తాత్త్విక దృష్టికి, అనన్యభక్తికి నిదర్శనం. లోకులు ఒకే పదార్థాన్ని పలురకాలైన భాషల్లో వివిధాలైన పదాలతో పిలిచినట్లు పరమాత్మనుకూడా పలురకాలుగా పిలుస్తున్నారు, తలుస్తున్నారు. ఎవ్వరు ఏ నామంతో తలచినా, ఏ రూపంగా కొలిచినా అది శ్రీవేంకటేశ్వరునే గాని వేరొకరిని కాదన్నది అన్నమయ్య స్థిరవిశ్వాసం.

అన్నమయ్య దృష్టిలో శ్రీవేంకటేశ్వరుడే సర్వాధికారి. సాకార, నిరాకార బ్రహ్మం రెండూ ఆయనే. ఈ అంశాన్ని అన్నమయ్య వింగడించిన తీరు, ప్రదర్శించిన తాత్త్విక దృష్టి అనన్య సామాన్యాలు.

నిత్యాత్ముఁడైయుండి నిత్యుఁడై వెలుగొందు,

సత్యాత్ముఁడై యుండి సత్యమై తానుండు

ప్రత్యక్షమై యుండి బ్రహ్మమైయుండు,

సంస్తుత్యుఁడీ తిరువేంకటాద్రి విభుఁడు

ఏ మూర్తి లోకంబులెల్ల నేలెడు నాత దేమూర్తి

బ్రహ్మాదులెల్ల వెదకెడు నాతఁడు

ఏ మూర్తి నిజమోక్ష మీయఁజాలెడు నాతఁడేమూర్తి లోకైక హితుఁడు

ఏ మూర్తి నిజమూర్తి ఏ మూర్తియును గాడు,

ఏమూర్తి త్రైమూర్తులేకమైన యాతఁడు

ఏ మూర్తి సర్వాత్ముఁడే మూర్తి పరమాత్ముఁ డామూర్తి

తిరువేంకటాద్రి విభుఁడు.

అన్నమాచార్యుల అనన్యభక్తి వైశిష్ట్యాన్ని చాటి చెప్పడానికి నిజానికి ఈ ఒక్క సంకీర్తన సరిపోతుంది. సృష్టి స్వరూపమే శ్రీనివాసుడు. స్థితి, లయాలుకూడా ఆయన అధీనమే. సకల జీవులలోని చైతన్యమూ ఆయనే. అన్నింటిన మించి ఆయన 'భువనైక హిత మనో భావకుడు', మోక్షప్రదాత. అన్నమయ్య అనన్యభక్తికి, తత్త్వచింతనా స్వారస్యాన్ని ప్రకటించే సామర్థ్యానికి ఈ సంకీర్తన ప్రత్యక్ష నిదర్శనం.

విష్ణుఁడొక్కడే విశ్వాంతరాత్ముఁడు

అన్నమాచార్యులు "వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః" అన్న గీతావాక్యానికి దృష్టాంతంవంటి వారు. అనన్యభక్తులైన వైష్ణవులకు "సర్వం విష్ణుమయం జగత్" అన్న దృష్టి సహజ లక్షణం. ఈ విషయాన్ని అన్నమయ్య పలు పదాల్లో, పలురీతుల్లో వ్యక్తీకరించాడు.

ఎదుట నెవ్వరు లేరు యింతా విష్ణుమయమే.

వదలక హరిదాస వర్గమైన వారికీ

ముంచిన నారాయణ మూర్తులే జగమెల్ల

అంచిత నామములె ఈ అక్షరాలెల్ల

పంచుకొన్న శ్రీహరి ప్రసాద మీరుచులెల్ల

తెంచి వేసి మేలు దాఁ దెలిసేటి వారికి

(అధ్యా. సంకీ. –502, సంపు – 1)

గాఢమైన తాత్త్వికులకు, స్థిరభక్తి చిత్తులకు మాత్రమే సాధ్యమయ్యే వ్యక్తీకరణగా చెప్పవచ్చు. అన్నమయ్య దృష్టిలో శ్రీవేంకటేశునికంటే 'మరి లే దితరములు'

సర్వాంతర్యామి

శ్రీవేంకటేశ్వరుడుకూడా మనకొరకు అర్చ్యామూర్తిగా నిలిచినాడేకాని ఆయనకు దివ్యవిగ్రహంతో పనిలేదు.

నిరాకార బ్రహ్మమైన పరమాత్మ అష్టమూర్తి సమన్వితుడు. భూమ్యాకాశాలు, జలం, అగ్ని, వాయువు, సూర్యచంద్రులు, యజ్ఞపురుషుడనేవి అష్టమూర్తులు. అట్లే గరిమ, లఘిమ, మహిమ, ప్రాకామ్య, ఈశత్వ, వశిత్వములనేవి పరమాత్మను ఆశ్రయించిన అష్టసిద్ధులు.

ఈ పరమాత్మ తన అష్టమూర్తులతో పరమాణువు మొదలుకొని పదునాల్గు భువనాలూ వ్యాపించి, అష్టసిద్ధులతో తన లీలా విభూతుల్ని ప్రకటిస్తుంటాడు. సాకారమూర్తిగా యజ్ఞపురుషత్వ భావనతో మన కైంకర్యాలందుకొనే శ్రీవేంకటేశ్వరుడే నిరాకార నిర్గుణ బ్రహ్మమైన పరమాత్మ. ఆయన సర్వవ్యాపకత్వాన్ని అన్నమయ్య సులభ సుబోధకంగా చెప్పాడు.

విశ్వప్రకాశునకు వెలి యేడ లో నేడ

శాశ్వతున కూహింప జన్మ మిఁక నేడ

(అధ్యా. సంకీ – 355, సంపు – 1)




తన దైవమైన శ్రీనివాసుడు బ్రహ్మానంద సుఖైక జీవన విధాయకతను నమ్మి సుఖదుఃఖాలలోను, మానావమానాల్లోను విడువక కొలిచిన అనన్య భక్తి తత్పరుడు – అన్నమాచార్యులు. లోక సహజమైన చాంచల్యాలు తన అధ్యాత్మస్థితిని వణికిస్తున్నపుడు కూడా

"ఎన్నఁడు విజ్ఞానమిఁక నాకు, విన్నపమిదె శ్రీవేంకటనాథా" (అధ్యా. సంకీ – 343, సంపు – 4) అని మొరపెట్టుకొని "ఆఁకటి వేళల నలపైన వేళలను తేఁకువ హరినామమే దిక్కు మఱి లేదు" (ఆధ్యా. సంకీ–158, సంపు–1) అని నమ్మిన స్థిరభక్తి చిత్తుడు అన్నమాచార్యులు. ఆయన అధ్యాత్మ, శృంగార సంకీర్తలందంతటా ఈ విశిష్టభక్తిరసం చిప్పిల్లుతూ సహృదయ ఆస్వాదన సంసిద్ధమై ఉంటుంది.

లోకవిరక్తి

భాగవతుడు లోకంలో నారాయణుడు తప్ప తక్కినదంతా మిథ్యయని గుర్తించడంవల్ల లౌకిక విషయాలపట్ల విరక్తి, దైవం పట్ల అనురక్తి కలుగుతుంది. అన్నమయ్యకు ప్రాపంచిక సుఖాలపట్ల తీవ్రమైన విరక్తి ఉంది. "నానాటి బదుకు నాటక" మని గుర్తెరిగిన పరిపూర్ణ వివేకి అన్నమాచార్యులు. హరిమాయకు బద్ధుడైన జీవుడు ధన, కనక, కాంతా సుతులకు దాసుడై, తన స్థితిని గుర్తించలేక,



హరిశరణాగతియే ముక్తి హేతువని గ్రహించలేక వివేకాన్ని కోల్పోయి జీవిస్తున్నాడు. అన్నమయ్య ఈ అంశాన్ని వైరాగ్య ధోరణిలో పలు సంకీర్తనల్లో ప్రస్తావించాడు.

కడలుడిపి నీరాడఁగాఁ దలచు వారలకు
కడలేని మనసునకు గడమ ఎక్కడిది

(అధ్యా. సంకీ. – 226, సంపు – 1)

జీవుడు భార్యాపుత్రులకోసం, స్వసుఖాలకోసం నిరంతరం శ్రమించి, తర్వాతి సమయం భగవత్సేవకు వినియోగించాలను కోవడాన్ని – కడలిని దాటి స్నానం చేయాలనుకోవడం వంటిదని, కడలికి – కోర్కెలతో కాగే మనసుకు కడమలేదని చెప్పడం వైరాగ్యం.

లోకంలోని వస్తుసమూహమంతా అసత్తు – నశించి పోయేది. తాను అధికంగా ప్రేమించే భార్యాపుత్రులు, పరివారం తుదకు తానుకూడా నశించడమే సత్యం. జీవుడు ఈ సత్యాన్ని గుర్తించకపోవడమే మాయ. యక్షుడు లోకంలో అన్నింటికంటే ఆశ్చర్యకరమైన విషయమేమిటని ప్రశ్నిస్తే, ధర్మజుడు మరణించిన వాణ్ణి చూచి, మరణించబోయేవాడు దుఃఖించడమని చెప్పింది – మాయను ఉద్దేశించే. జీవుడు తాను నిత్యమని భ్రమించి, హరిశరణు వేడక కాలయాపన చేస్తున్నాడు. బ్రహ్మ సత్యం, జగన్మిథ్య అని గుర్తించడమే వివేకమని ముందే చెప్పుకున్నాం. కోర్కెలు తీరిన తర్వాత పరతత్త్వాన్ని చింతించడం ఎప్పటికీ వీలుకాదు. ఎందుచేతనంటే ఈ కోర్కెలకు కడమ లేదు. అందుకే లౌకిక విషయాసక్తిని కొంతైన విడచి, శ్రీవేంకటేశుని ఆశ్రయం పొందడమే "కందువెరిఁగిన మేలు" అని అన్నమయ్య భావన.

మధురభక్తి – లోకవిరక్తి

అన్నమాచార్యులు శృంగారసంకీర్తనలే అధికంగా రచించారు. జీవనాయిక మధుర భక్తితో లోకంలోని సుఖాలను విడచి,

"మేటినేరువరులాల మెలుఁతలాల
కూటము లిద్దరికినిఁ గూరుచరె యెపుడు"

(శృంగా. సంకీ – 93, సంపు – 28)

అంటూ పరమాత్మ పొందుకోసం పరితాపం చెందడం కూడాలోక విరక్తిలోని అంశమే!

"పొందెఱుఁగుదు నందువు భోగినందువు, నీ
యందరు సతులకు నే నాకు మడిచిత్తునా"

అన్న పల్లవిగల సంకీర్తనలో ఫలశ్రుతిలో వేంకట ముద్రాంకితంగా చెప్పిన చరణంలో

వేడుకలెందైనాఁ బారవేసేవు నీ
వాడికచేఁత లెన్నైనా వన్నె వెట్టేవు
ఈడు లేని తిరువేంకటేశా కూడితివి నన్ను
వాడుచు నీ తోడ నేను వాసి చూపఁగలనా

(శృంగా. సంకీ-65, సంపు-5)

అంటూ జీవనాయిక 'వాడుచు' అలౌకికానందసంధాయకమైన పరమాత్ముని పొందును అనుభవిస్తుంది.

అన్నమయ్య వేలకొలదీ శృంగార సంకీర్తనలు వ్రాసినా ఏ ఒక్కటీ శాస్త్రవిరుద్ధంగా వ్రాయలేదని చెప్పడం శాస్త్రసమ్మతం. శాస్త్రనాయికల లక్షణాలకు అనుగుణంగానే అన్నమయ్య జీవనాయికలు ప్రవర్తిస్తారు.

అన్నమయ్యశృంగార నాయికల పరమగమ్యం బ్రహ్మానంద సుఖమేగాని, దేహచింత కాదు. మధురభక్తి పరమార్థమిదే! తాత్త్విక దృష్టితో అన్నమాచార్యులవారిని పరిశీలిస్తే లౌకిక సుఖాలపట్ల తీవ్రమైన విరక్తితో, స్థిరమైన విశ్వాసంతో, అనన్య భక్తిని తన సంకీర్తన యజ్ఞంద్వారా సాధన చేసినారనీ, తద్ద్వారా తెలుగువారికి ఉత్తమ పథ నిర్దేశం చేసి, సంకీర్తనను మోక్షసాధనంగా అన్నమయ్య ప్రసాదించినారనీ చెప్పడం అక్షరసత్యం.

తిరుమల పాదయాత్ర భక్తులకు కాలినడక మార్గంలో, తిరుమల తిరుపతి దేవస్థానం కల్పించే ఉచిత సౌకర్యాలు

1) **ఉచితలగేజి రవాణాకేంద్రం :** తిరుపతి అలిపిరి నుండి కాలిబాటమార్గంలో నడచివెళ్ళే భక్తులు తమ లగేజీని అలిపిరి వద్ద గల ఉచిత లగేజిరవాణా కేంద్రంలో అంద చేస్తే ఆ లగేజీని తిరుమల కొండపై ఉన్న లగేజీ రవాణా కేంద్రం వద్ద తిరిగి తీసుకొనే ఏర్పాటు కలదు.

2) **త్రాగునీరు మరియు రక్షణ :** అలిపిరి నుండి కాలిబాటలో భక్తులకు దారిపొడవునా త్రాగునీటి వసతి కల్పించ బడింది. మరియు రక్షణనిమిత్తం తి.తి.దేవస్థానం సెక్యూరిటీ గార్డులను నియమించింది.

3) **తిరుమలలో బసచేయడానికి వసతి సముదాయం :** భక్తులు బసచేయడానికి తిరుమలలో ఉచితవసతి సము దాయం ఏర్పాటు చేయబడింది. అందులో ఉచిత లాకర్, ఉచితభోజనవసతి, మరుగుదొడ్లు సౌకర్యాలు కలవు.

4) **బస్సు సౌకర్యం :** తిరుమలలో ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి వెళ్ళుటకు సుమారు 16 ఉచిత బస్సులు కలవు. తిరుమల తిరుపతి దేవస్థానము మరియు ఏ.పి.ఎస్. ఆర్.టి.సి. సంయుక్త ఏర్పాటుతో ఈ ఉచితరవాణా సౌలభ్యం ప్రతి 3 నిముషాల కొకసారి కలదు.

తిరుమల శ్రీవారి జ్యేష్ఠాభిషేక మహోత్సవక్రమము

01-6-2015	సోమ	వజ్రకవచ సమర్పణ	జ్యేష్ఠమాసమున జ్యేష్ఠానక్షత్రమున జరుగును
02-6-2015	మంగళ	ముత్తంగి కవచ సమర్పణ	
03-6-2015	బుధ	సువర్ణ కవచ సమర్పణ	

శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణ ట్రస్టు



గోజాతిని సంరక్షించి, హిందూ మత వ్యవస్థలో వానికి గల విశిష్టతను తేటతెల్లం చేసే సత్సంకల్పంతో తి.తి.దే. 1956 లో గోసంరక్షణ శాలను నెలకొల్పింది. దీనికి అనుబంధంగానే 2002 సంవత్సరంలో గోసంరక్షణ ట్రస్టు ఏర్పాటు చేయబడింది. ఈ ట్రస్టుకు విరివిగా విరాళాలిచ్చి, పశుసంవర్ధనకు మీ సహాయ సహకారాలను అందించండి. మీ అభీష్టం మేరకు గోశాలలోని మూగజీవులను దత్తత తీసుకుని వాటి పోషణ బాధ్యతను వహించడానికి కదలిరండి. అధికరణం 80 (జి) క్రింద ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వబడుతుంది.

డిమాండు డ్రాఫ్ట్ / చెక్కులు

కార్యనిర్వహణాధికారి, తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి - 517501

పంపవలసిన చిరునామా :

ది డైరెక్టర్, ఎస్.వి. గోసంరక్షణ ట్రస్టు, ఎస్.వి.డైరీ ఫారమ్,
చంద్రగిరి రోడ్డు, తిరుపతి -517502.

తదుపరి సమాచారం కోసం సంప్రదించవలసిన ఫోను నెంబరు : 0877-2264570




ఇటీవల
తిరుమల ఆలయంలో
జరిగిన వసంతోత్సవ
దృశ్యమాలిక







తిరుమల తిరుపతి దేవస్థానముల
ధర్మకర్తల మండలి

తిరుమల తిరుపతి దేవస్థానముల నూతన ధర్మకర్తలమండలిని
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం నియమించింది.
అధ్యక్షులు, సభ్యులు, ఎక్స్‌అఫిషియో సభ్యులచే 02.05.2015
శనివారం ఉ॥ 11.09 గం॥లకు తిరుమల
శ్రీ వేంకటేశ్వరస్వామివారి సన్నిధిలో
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ డి. సాంబశివరావు, ఐ.ఏ.ఎస్.,
ప్రమాణ స్వీకారం చేయించారు. వీరికి తి.తి.దే. అధికారులు
శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో
తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారులు
శ్రీ కె.ఎస్.శ్రీనివాసరాజు, ఐ.ఏ.ఎస్.,(తిరుమల) ,
శ్రీ పోల భాస్కర్, ఐ.ఏ.ఎస్., (తిరుపతి)
మరియు ఆలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.





అధ్యక్షులు
శ్రీ చదలవాడ కృష్ణమూర్తి, తిరుపతి



సభ్యులు
శ్రీమతి కె. లలితకుమారి, విజయనగరం



సభ్యులు
శ్రీమతి పి. అనంతలక్ష్మి, కాకినాడ



సభ్యులు
డా॥ డి.ఎస్. బాలవీరాంజనేయస్వామి, ప్రకాశం



సభ్యులు
శ్రీ పి.సుధాకర్ యాదవ్, కడపజిల్లా



సభ్యులు
శ్రీ జి. సాయన్న, సికింద్రాబాదు



సభ్యులు
శ్రీ ఎ.వి.రమణ, హైదరాబాదు



సభ్యులు
శ్రీ వి. కృష్ణమూర్తి, తమిళనాడు




సభ్యులు
శ్రీ జె. శేఖర్, తమిళనాడు



సభ్యులు
శ్రీ డి.పి. అనంత, కర్ణాటక



సభ్యులు
శ్రీమతి ఇ. సుచిత్ర, హైదరాబాదు



సభ్యులు
శ్రీ కె.రాఘవేంద్రరావు, హైదరాబాదు



సభ్యులు
శ్రీ సంపత్ రవి నారాయణన్, కర్ణాటక



సభ్యులు
డా॥ పి. హరిప్రసాద్, తిరుపతి



ఎక్స్ అఫిషియో సభ్యులు
డా॥ డి. సాంబశివరావు, ఐ.ఏ.ఎస్.
కార్యనిర్వహణాధికారి, తి.తి.దే.





ఇటీవల
శ్రీవారి దర్శనానికై విచ్చేసిన
ఆంధ్రప్రదేశ్
ముఖ్యమంత్రివర్యులు







శ్రీవారి దర్శనానంతరం ప్రసాదాలు స్వీకరిస్తున్న
ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి శ్రీ ఐ.వై.ఆర్. కృష్ణారావు



30-3-2015 తేదీన ముఖ్య నిఘా మరియు భద్రతాధికారిగా
పదవీబాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీ డి. నాగేంద్ర కుమార్, ఐ.పి.ఎస్.

శ్రీ వేంకటేశ్వర నిత్యఅన్నప్రసాదం ట్రస్టు
30 సం॥లు పూర్తయిన సందర్భంగా
పూజాకార్యక్రమంలో పాల్గొన్న
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి





అహింసా ప్రథమం పుష్పం, పుష్ప మింద్రియ నిగ్రహః ।
సర్వభూత దయాపుష్పం, క్షమాపుష్పం విశేషతః ॥
శాంతి పుష్పం, తపః పుష్పం, ధ్యాన పుష్పం తథైవ చ ।
సత్య మష్టవిధం పుష్పం విష్ణోః ప్రీతికరం భవేత్ ॥

– అహింస, ఇంద్రియనిగ్రహం, సర్వభూత దయ, క్షమ,శాంతి, తపస్సు, ధ్యానం, సత్యం అనే ఎనిమిది పుష్పాలు తనకు అత్యంత ప్రీతికరమని సాక్షాత్ శ్రీవిష్ణు భగవానుడు పేర్కొన్నాడు.

సాధారణంగా ఆధ్యాత్మికాసక్తి కలవాళ్లు పుష్పాలతో భగవంతుణ్ణి పూజిస్తారు. ఐతే ఈ పుష్పాల్లో కొన్నింటిని కొందరు దేవతలు ఇష్టపడరు. తెలియక చేసినదానికి పాపమంటకపోయినా, మనం చేసేపుణ్య కార్యాన్ని తెలుసుకొని చేయటం ద్వారా ఎక్కువ ఫలితాన్ని పొందవచ్చు. తెలిసి ఆచరించిన పూజలు గొప్ప ఫలితాన్నిస్తాయని పెద్దలు చెప్తారు.

గణేశునికి ఎర్రని పూలంటే ప్రీతి. సంకటాలు తొలగడానికి గరికెతో పూజిస్తే మంచిది. వినాయక చవితినాడు తప్ప మరెప్పుడు తులసితో ఆయనను పూజించరాదు.

సరస్వతీమాతకు తెల్లని పూలు, జాజి మల్లెలు ఇష్టం. ఆ తల్లిని “యా కుందేందు తుషార హార ధవళా” అని స్తుతించటం గమనించవచ్చు. లక్ష్మీ అమ్మవారికీ ఈ పూలే ఇష్టం. ఆ తల్లినీ “ధవళ తరాంశుక గంధమాల్యశోభాం”– అని స్తుతిస్తూ ఉంటాం కదా!

గాయత్రి, దుర్గ, లలిత, అమ్మవార్లకు ఎర్రని పూలు ఇష్టం. ‘‘అరుణమాల్య భూషాంబరాం, జపాకుసుమ భాసురామ్” అనే స్తుతులు వీటిల్ని నిరూపిస్తాయి. అంతేకాక ఎరుపు ఆ అమ్మలకు ప్రీతి. లలితాదేవి పాదాలవద్ద ఎర్రనిపుష్పాలు, ఎర్రరాళ్ళ కిరీటం, ఎర్రని ఆభరణాలు, ఎర్రనివస్త్రాలు ఉండడం ఆమెకు ఎరుపుపట్ల గల ప్రీతిని తెలియచేస్తాయి.

శ్రీమన్నారాయణుణ్ణి కదంబపుష్పాలతో పూజ చేస్తే స్వర్గం లభిస్తుంది. అగసిపూలతో పూజ చేస్తే పదివేల యజ్ఞాలు చేసినఫలం లభిస్తుంది.



పీసాపాటి నాగేశ్వర శర్మ, గుంటూరు, 08645-255474

దిరిసెన, ఉమ్మెత్త, గిరిమల్లి, మల్లి, బూరుగ, జిల్లేడు, కొండగోగు పూలు విష్ణుపూజకు అనర్హం.

శ్రీకృష్ణుడు నీలమేఘశ్యాముడే అయినా నీలిరంగుపూలు ఆయనపూజకు పనికిరావు. మెట్టతామర, పున్నాగ, మందార, కావిరేగు, కచ్చూరాలు, ఒకే ఒక్క రెక్క ఉండే పూలు కృష్ణపూజకు పనికి రావు.

పార్వతీదేవికి ఉసిరిక (సంస్కృతంలో ధాత్రి) ఆకులు ఇష్టం. దుర్గాదేవికి వైశాఖంలో వకులపుష్పాలు, జ్యేష్ఠంలో నాగకేసరాలు, ఆషాఢంలో కరవీరాలు, శ్రావణంలో చంపకాలు, తామరలు, భాద్రపదంలో లొద్దుగలు, ఆశ్వయుజంలో ఒంధూకాలు, కార్తికంలో అగస్త్యాలు, మార్గశిరంలో బిల్వపత్రాలు, పౌష్యంలో దూర్వాలు, మాఘంలో కుందాలు, ఫాల్గునంలో మాధవీపుష్పాలు, చైత్రంలో అశోకపుష్పాలు మొదలైనపూలు సేకరించి, ఆయా మాసాల్లో చెప్పిన రకాల పుష్పాలతో పూజిస్తే ఎంతో శ్రేష్ఠమట! శివునికి తామరపూలు, మారేడు దళాలు, శతపత్రం, శంఖ పుష్పాలు, తుమ్మి పూలు ఇందులో అన్నీ ఇష్టమైనవే! ఆయా పూలల్లోని ఏదో ఒకదానితో లక్షపూలతో అర్చన చేస్తే – శివుడు సంతృప్తితో ధనవృద్ధి చేస్తాడు. కోటి బిల్వ దళాలను సుగంధ గంధంతో తడిపి కానీ ఇట్లే శంఖ, తామరపూలతో కానీ అర్చిస్తే రాజభోగాలు ప్రసాదిస్తాడు. ఐదుకోట్ల పూలతో అర్చిస్తే ప్రధాన యోగం కల్గిస్తాడు. యాభైవేల పుష్పార్చనతో రోగవిముక్తిని, ఆరోగ్యాన్ని – ఇరవైవేల

పుష్పార్చనతో అనుకూలభార్య లేదా భర్త లభింపచేస్తాడు. పన్నెండువేల ఐదువందల పుష్పార్చనతో విద్యాధికృత, పదివేల పుష్పార్చన అమితకీర్తి, ఐదుకోట్ల పుష్పార్చన ముక్తి, ఒక కోటి పుష్పార్చన జ్ఞానసిద్ధి, ఒక లక్ష అర్చనతో శరీర శుభ్రత ప్రాప్తిస్తాయి. రెండు లక్షల పుష్పార్చనతో జన్మాంతర జ్ఞానసిద్ధి, మూడు లక్షల పుష్పార్చనతో కర్మ నాశనం, లక్ష ఉమ్మెత్త పుష్పార్చనతో పుత్రసంతానం, లక్ష అవిసిపుష్పార్చనతో గొప్ప పేరు, లక్ష తులసి అర్చనతో సిద్ధి – బుద్ధి, మోదుగ పుష్పార్చనతో రోగనిరోధం, కస్తూరి పుష్పార్చనతో విష్ణు అనుగ్రహసిద్ధి కల్గుతుంది. జాజిపూలతో అర్చన వాహనసౌఖ్యం, కరవీర పుష్పపూజ రోగశాంతి, మంకెన పుష్ప పూజ అలంకారం, గరికతో అర్చన ఆయుస్సు పెంచుతుంది. జిల్లేడుపూల పూజ శత్రుజయాన్ని కలిగిస్తుంది.

సంపెంగ, మాలతి,గురువింద, మొల్ల, జపాకుసుమ, దిరిసెన, బండి, మొగలి శివపూజకు అనర్హం. ఆత్మార్పణతో చేసే పూజలో నిషిద్ధాలు లేకపోయినా స్నానం చేయకుండా పుష్పాలు అర్చననిమిత్తం సేకరించటం, ఒకమారు వాడిన పూలు పూజకు పనికిరావు. తులసి, బిల్వ పత్రాలు, అగస్త్య పుష్పాలు, కోసిన తర్వాత ఐదు రోజులవరకు తాజాగా ఉంటాయి కనుక వీటికి ఆనిషిద్ధం లేదు. శివాగమం ప్రకారం ఇంట్లో పూలు లేకపోతే పూలమ్మేవారి వద్ద పుష్పాలు కొని, నిరభ్యంతరంగా అర్చనకు ఉపయోగించవచ్చు. పుష్పమాల, పుష్పరహస్యం, పుష్పమాహాత్మ్యం, పుష్పనిరూపణ ప్రకరణం, పుష్పమాలాస్తవం, పుష్పవిధి, పుష్పరత్నాకరం, పుష్ప చింతామణి అనే ఉద్గ్రంథాల్లో వీటి గురించిన విషయాలు విస్తారంగా తెలుపబడ్డాయి.

అయితే కొందరు వారంలో వారికి నచ్చిన ఏదో ఆది వారంనుంచి శనివారం లోపల వారప్రాధాన్యం గల దేవతలకు పూజ చేసి, పుష్పాలతో అలంకరించి, వారం అయ్యేవరకు ఆ పూలు తీయరు. కానీ ఇట్లు చేయరాదు. దేవుని పటానికి పూలు లేకపోయినా ఫరవాలేదు కానీ వాడిపోయిన పూలు ఉంచరాదు. ఇవాళ అర్చన చేసిన పూలను మర్నాడు తప్పని సరిగా తీసివేయాలి. వాటిని "నిర్మాల్యం" అంటారు. నిర్మాల్యం ఉండటం దోషకరం. కొందరు ఆపూలను తీసివేసి, విసిరి అవతల పారవేస్తారు. అవి ఎవరన్నా త్రొక్కితే ఆ పాపం మనకే! ఎవరూ త్రొక్కని చోట వాటిని వేయాలి.

పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి।
తదహం భక్త్యుప హృత మశ్నామి ప్రయతాత్మనః॥


(గీత–9–26)

భక్తితో ఆకు, పువ్వు, పండు, నీరు – సమర్పించినా – పరిశుద్ధ మనస్సుతో ఇచ్చింది స్వయంగా స్వీకరించి, ఆనందిస్తాను – అన్నాడు భగవంతుడు. పత్రంవల్ల విదురుడు, ద్రౌపది, ఫలంతో శబరి, తోయంతో రంతిదేవుడు, పుష్పంతో గజేంద్రుడు మోక్షాన్ని పొందారు. పుష్పానికి గల పవిత్రతవల్ల ఎందరో గురువులు పుష్పంతో బహురూప వర్ణనలూ, ప్రార్థనలూ చేస్తారు. జగద్గురువులు శ్రీఆదిశంకరులు తమ శివానందలహరిలో ...

"ఉమాపతివైన ఓ పరమేశ్వరా! చిత్తం అనే కమల పుష్పాన్ని నీకుఅర్పించి, సుఖంగా ఉండేందుకు జనులు తెలుసుకొన లేకున్నా"రని ప్రబోధించారు.

మన పౌరాణిక గాథల్లో పుష్పయుద్ధాలుకూడా ఉన్నాయి. శ్రీకృష్ణుడు సత్యభామ కోరికపై దేవేంద్రునిపై దాడి చేసి – పారిజాత పుష్పంకోసం పారిజాతవృక్షాన్నే స్వర్గంనుంచి తెచ్చినవైనం, ద్రౌపది కోరికపై "సౌగంధికపుష్పం" కోసం భీముడు యుద్ధం చేయడం సాధించటం లాంటి వృత్తాంతాలున్నాయి. దైవానికి చేసే పుష్పార్చన పరమపవిత్రమేకాక అందరికీ దైవానుగ్రహాన్ని ప్రాప్తింపచేసేందుకు దోహదం చేస్తుంది.





'శ్రీవారిసేవ'

వాలంటీర్లకు మార్గదర్శకసూత్రాలు

శ్రీవారిసేవలో ఒక వారంపాటు సేవ లందించుటకై పదిమంది సభ్యులకు తక్కువ కాకుండా ఉన్న సముదాయానికి అర్హత లభిస్తుంది. నిస్స్వార్థసేవ అందించుటకుగాను ఈ సభ్యులకు ఆధ్యాత్మికపరిజ్ఞానం ఉండాలి. స్త్రీపురుషభేదం లేదు. ఆసక్తిగల సమూహంలోని సభ్యులు వారియొక్క పేరు, చిరునామా, వయస్సు, స్త్రీలు/పురుషులు, మొదలైన వివరాలతో ఒక నెల ముందుగా "పౌరసంబంధాధికారి, తిరుమల తిరుపతి దేవస్థానములు, కపిలతీర్థం రోడ్డు, తిరుపతి - 517501" అనే చిరునామాకు పంపాలి. మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు : 0877 - 2263544, 0877 - 2264392.

- శ్రీవారిసేవకు వచ్చే గ్రూపు లీడరు లేదా కో-ఆర్డినేటర్ వాలంటీర్ల పూర్తి వివరాలను తిరుమలలోని శ్రీవారి సేవా సదన్‌లో అందజేయాల్సి ఉంటుంది.
- శ్రీవారిసేవకుల వయసు 18 పూర్తి అయి ఉండి 60 ఏళ్ల లోపు ఉండాలి.
- శ్రీవారి సేవకులు తమ వెంట చిన్న పిల్లలను, వృద్ధులను, వ్యాధిగ్రస్తులను తీసుకు రాకూడదు. ఒకవేళ తీసుకొస్తే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ సేవకు అనుమతించరు.
- శ్రీవారిసేవకు విచ్చేసే శ్రీవారి సేవకులందరూ ఆరోగ్య ధ్రువీకరణ పత్రం (మెడికల్ సర్టిఫికేట్) కాపీని గుర్తింపు పొందిన వైద్యునిచేత అటెస్ట్ చేయించి సమర్పించాల్సి ఉంటుంది.
- సేవకులు తమకు కేటాయించిన తేదీల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటలలోపు తిరుమలలోని ఆర్.టి.సి. బస్టాండు లోపల గల **శ్రీవారి సేవాసదన్**‌లోని సహాయ ప్రజా సంబంధాల అధికారి/ఆఫీసర్ ఆన్ స్పెషల్‌డ్యూటీ/సూపరింటెండెంట్ వారికి రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.
- సేవాసదన్‌లోని సేవకులకు ఉచిత బస కల్పించబడుతుంది. పురుషులకు సేవాసదన్‌నందు, స్త్రీలకు పి.ఏ.సి-3 నందు వసతి కేటాయించబడును. సేవకులు తమకు కేటాయించిన లాకర్‌కోసం సొంతంగా తాళం, చెవులను తెచ్చుకోవాలి.
- శ్రీవారిసేవాసదన్‌లో ప్రతిరోజు సాయంత్రం 4 గంటలకు డ్యూటీలు కేటాయిస్తారు. సేవకులు ప్రతిరోజు కనీసం ఆరు గంటలు పాటు సేవ చేసేందుకు సిద్ధంగా ఉండాలి.
- సేవా విధుల్లో ఉన్నప్పుడుమాత్రమే శ్రీవారిసేవ స్కార్ఫ్‌లను ధరించాలి.
- బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండురోజుల ముందే సేవకు హాజరై సరైన శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది.
- ఎల్లప్పుడు **'గోవింద'** నామాన్ని స్మరిస్తూ, భక్తులను **'గోవింద** అని సంబోధించాలి.
- శ్రీవారిసేవ పూర్తిగా యాత్రికులకు సహాయం చేసేందుకు ఉద్దేశించిన స్వచ్ఛంద సేవ మాత్రమే. సేవ కోసం టీమ్ లీడరుకు గాని, సిబ్బందికి గానీ ధనరూపంగా, వస్తు రూపంగా ఎలాంటి చెల్లింపులు చేయనవసరం లేదు.
- హిందువులకు మాత్రమే శ్రీవారి సేవ చేసేందుకు అనుమతి ఉంది.
- ప్రతి శ్రీవారి సేవకుడిని హిందువుగా గుర్తించేందుకు తిరునామం/తిలకం లేదా కుంకుమ/చందనం బొట్టు ధరించాలి.
- శ్రీవారి సేవకులు భక్తులలో స్వామివారిని దర్శిస్తూ అంకితభావంతో సేవ చేయాల్సి ఉంటుంది.
- శ్రీవారి సేవకులు తమకు సేవ కేటాయించిన ప్రదేశంలో మాత్రమే సేవ చేయాలి. గర్భాలయంలోసేవ నిర్బంధసేవ కాదు (Compulsory). గర్భాలయంలో సేవకొరకు ఒత్తిడి చేయకండి.
- శ్రీవారి సేవాసదన్‌లోగాని, పి.ఏ.సి.III లోగాని టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచండి.
- సేవాసదన్‌లో ఉండే మహిళాసేవకులు రాత్రిళ్ళు నైటీలు ధరించరాదు.
- శ్రీవారిసేవలో నిర్దేశించిన నియమనిబంధనలను ఏదేని పరిస్థితుల్లో శ్రీవారిసేవకులు అతిక్రమిస్తే వారు రెండేండ్ల వరకు సేవకు అనుమతించబడరు.
- తిరుమలలోని ఆస్థానమండపంలో ప్రతి బుధవారం మధ్యాహ్నం 2-00 గంటలకు శ్రీవారిసేవకులకు శిక్షణ తరగతులు జరుగుతాయి.
- సేవాసదన్ మరియు పి.ఏ.సిల్లో శ్రీవారిసేవకుల కార్యకలాపాలను ఇద్దరు లేదా ముగ్గురు శ్రీవారిసేవ కో-ఆర్డినేటర్లు పర్యవేక్షిస్తారు. దయచేసి వారికి సహకరించండి.

డ్రస్‌కోడ్- పురుషులు: తెలుపు రంగు వస్త్రాలు, స్త్రీలు: మెరూన్ బార్డర్‌తో కూడిన ఆరంజ్ కలర్ చీర, మెరూన్ బార్డర్ రవిక.

ధర్మమే మానవ మనుగడకు మార్గం

కే. యస్. శాంతలక్ష్మి, అనంతపురం

"అస్థిరం జీవితం లోకే, అస్థిరేధన యౌవనే
అస్థిరాః పుత్రదారాశ్చ ధర్మః కీర్తిద్వయం స్థిరం"

ఈ ప్రపంచంలో జీవితం అశాశ్వతమైనది. ధనమూ యవ్వనము, భార్యాపుత్రులంతా అశాశ్వతం. శాశ్వతమైనది ధర్మమూ కీర్తి మాత్రమే!

మానవ జీవిత సార్థక్యత అపరిపక్వం నుండి పరిపూర్ణతను, అజ్ఞానంనుండి జ్ఞానం సాధించడంలోనే ఇమిడి ఉంది. ఇదే జీవితానికి పరమపురుషార్థమూ, ఉన్నతాశయమూ కూడ. ఇది సాధించడానికి అనువైన సాధనము ధర్మపథము. ఈ ప్రపంచం ఆధ్యాత్మిక విమోచనానికి స్థానమైతే జీవించడమన్నది చరమాశయానికి తోడ్పడే సాధనం. ధర్మం అన్నపదానికి వివిధ విధాలుగా అర్థాలను, నిర్వచనాలను చెప్పుకోవచ్చును. అనంత ఆనందానికి దారితీసేది అమృతత్వాన్ని చేకూర్చేది ధర్మం. మహాభారతంలో కురు పితామహుడైన భీష్ముడు "ఐక్యతను, సమానతను కలిగించేది, వాగ్వాదానికి తావీయనిది ధర్మం" అంటాడు. వివాదాస్పదమైన ఏ అంశమైనా అధర్మమేనని ఆయన అభిప్రాయం. మనువు నిర్వచనం ప్రకారం నైతిక వర్తనతో కూడుకున్నది మానవుని పశువుల నుండి వేరుగా నిలబెట్టగలిగేది ధర్మం. పాండవాగ్రజుడైన ధర్మరాజు "ఆత్మతో చివరి యాత్రలో పయనించగలిగేది ధర్మం" అని అంటాడు. కనుకనే విజ్ఞులు ఈవిధంగా అన్నారు.



"విదేశేషు ధనం విద్యా వ్యసనేషు ధనం మతిః
పరలోకే ధనం ధర్మః శీలం సర్వత్రనైధనమ్॥"

పరదేశంలో మానవుడికి తాను ఆర్జించిన విద్యయే ధనం, కష్టకాలంలో మానవుడి తెలివితేటలే ధనం, పరలోకంలో స్థానాన్ని సముపార్జించేది మానవుడు చేసిన ధర్మం, అన్ని వేళలా నిజమైన ధనం శీలం. హిందూమతం ఈ దివ్యమైన ధర్మమనే నియమం ఆధారంగా కొనసాగుతూ ఉంది. ఇది తోటి వారికి సహాయం చేయడాన్ని ప్రోత్సహిస్తుంది, వ్యక్తిగత లాభాలను గర్హిస్తుంది. జీవితం విలువలన్నింటిని సమానంగా ఆచరించాలని, అమలులో పెట్టాలని బోధిస్తుంది.

ధర్మం అన్న పదానికి సామాన్య స్థాయిలో నిర్వచనం చెప్పుకోవాలంటే ఇది మానవుడు చతుర్విధ పురుషార్థాలను సాధించడానికి, అన్ని వర్గాలప్రజలు అంటే చతుర్వర్ణాల వారు, తమ చతురాశ్రమాలలోనూ (బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసాశ్రమాలలో) నిర్వర్తించాల్సిన పరిపూర్ణ కర్తవ్యంగా భావించవచ్చు. క్రమశిక్షణతో సుశిక్షితులైన పెద్దలు ప్రవర్తించే తీరు ధర్మానికి నిలయంగా ఉంటుంది. మానవుడు ప్రకృతితోనూ, తోటి మానవులతోనూ, తనతో తాను వర్తించే తీరుకి కావాల్సిన మేలు కలయికకి ఈ ధర్మమనే అండ ఎంతో అవసరమైంది.

భగవంతుడు మూర్తీభవించిన ధర్మస్వరూపుడు, ఆయనే దీనిని పరిరక్షించేవాడు, దీనికి మూలస్థానమైనవాడు. ఈ శక్తివంతమైన ధర్మమనే సూత్రం మొత్తం సృష్టిని బంధించి ఉంచుతున్న శక్తి. భీష్ముడు మహాభక్తుడు. ఆయన అంపశయ్యపై ఉన్నరోజులలో ఒకనాడు శ్రీకృష్ణభగవానుడు ఆయన వద్దకు వచ్చినప్పుడు భీష్ముడు తన సందేహాన్ని తీర్చమని ఈ విషయం అడుగుతాడు. "పాండవులు ఎప్పుడూ నిన్నే స్మరిస్తూ, నీ సలహామేరకు జీవిస్తూ, సర్వం శ్రీకృష్ణార్పణంగా జీవించారు కదా! వారికి పదమూడేళ్ళ కఠోరమైన వనవాసం ఎందుకు కలిగింది? ఇంతటి మహా కురుక్షేత్ర యుద్ధాన్ని ఆపాలని నీవెందుకు సంకల్పించలేదు? అని అడుగుతాడు. దీనికి సమాధానంగా శ్రీకృష్ణుడు "ధర్మపు నియమావళి ముందు నావారు

పరాయి వారు అన్న తేడా లేదు. ప్రతి ఒక్కరూ వారి వారి పాపాలకి పరిహారం చెల్లించాల్సిందే! కౌరవులతో ద్యూతంలో పాల్గొనేముందు, పాండవులు నాతో సంప్రదించడంగాని, నా సలహాతీసుకోవడం గాని చేయలేదు. ఇది ఒకసారి కాదు రెండుసార్లు చేశారు. అందుకనే ఇన్ని బాధలను అనుభవించాల్సి వచ్చింది.” అని సమాధానం ఇస్తాడు.

ధర్మం అన్నది రెండు విధాలుగా ఆచరించాల్సి ఉంటుంది. సామాన్యధర్మం అనీ, విశేషధర్మమని. ఇందులో

1. తృప్తిగా జీవించడం 2. ఇంద్రియ నిగ్రహం కలిగి ఉండడం 3. ఆత్మసంయమనం 4.పవిత్రత కలిగి ఉండడం 5. క్షమాగుణం కలిగి ఉండడం 6. తప్పొప్పులను నిర్ణయించగలిగే వివేచనాశక్తి 7. న్యాయాన్యాయాలను తెలుసుకొనే మేధస్సు 8.ఆధ్యాత్మిక చింతన 9. సత్యవర్తన 10. కోపాన్ని దూరంగా ఉంచడంలాంటివన్నీ సామాన్య ధర్మవర్తనానికి కావాల్సిన ముఖ్యాంశాలు. ఇవి అందరూ పాటించాల్సిన నియమాలు, అనుసరించవలసిన జీవనవిధానం– ఇవన్నీ విశేషధర్మంలోని అంశాలు. సామాన్య ధర్మాన్ని సార్వత్రిక ధర్మమని కూడ అంటారు. దీన్ని అనుసరించే మానవుడు భగవంతుని చేత తప్పక రక్షించబడతాడు.

“అకృతం నైవకర్తవ్యం ప్రాణత్యాగే ప్యువస్థితే?
నీచకృత్యం పరిత్యాజ్యం ఏష ధర్మః సనాతనః॥”

మానవుడు ప్రాణం పోయేటంతటి కష్టసమయంలో కూడ చెడ్డపనులను చేయరాదు. తనధార్మిక మార్గాన్ని, మంచిపనులను విడిచి పెట్టరాదు. ఇది యుగ యుగాలుగా మానవుడికి ఏర్పరచిన ధర్మం. ధర్మానికి చెందిన నియమావళి సర్వకాలాలకు వర్తించేవి. అవి వ్యక్తిగతమైన ఇష్టాఇష్టాలకు అనుగుణంగా మారేవి కావు. ఇందులో బాహ్యసంబంధకర్మాచరణాలతోపాటు, మానసిక ఆలోచనలను, మానవుడు శీలాన్ని పెంపొందించే ఇతర చర్యలతో ముడిపడి ఉంటాయి. అర్జునుడు వ్యామోహాన్ని జయించి ఊర్వశిచేత శాపాన్ని పొందుతాడు. కాని ఈశాపము అతనికి అజ్ఞాతవాస సమయంలో అమూల్యమైన వరంగా భాసిస్తుంది. ఎందుకంటే అర్జునుడు ధర్మానికి కట్టుబడి ఈ శాపం పొందాడు. అతడు మానసికంగాకాని, శారీరకంగా గాని నిష్కళంక ప్రవర్తన కలిగి ఉన్నాడు.

“మిత్రం హ్యర్థగుణ శ్రేష్ఠం, సత్యధర్మపరాయణం।
తద్వయంతం పరిత్యక్తం నతు ధర్మే వ్యవస్థితం॥”

ధర్మం, సత్యం, ఆధారంగా ఏర్పడిన మిత్రుడు ధనం, ఇతర సంపదలకంటే శ్రేష్టమైనవాడు. అటువంటి మిత్రుడిని వదిలిన వాడు ధర్మాన్ని నిలుపుకోలేడు. ధర్మావతారుడైన శ్రీకృష్ణునితో చెలిమిచేసిన కుచేలుడు భౌతికమైన సంపదలను పొందడమేకాదు, అనంతమైన ఆనందాన్ని పొందగలిగాడు. అదే విధంగా శ్రీరామ మైత్రిని చవిచూచిన సుగ్రీవ, విభీషణులు అన్ని విధాలా సుఖసంతోషాలను పొందగలిగారు. కాని స్వార్థచింతనతో కర్ణుని చెలిమిచేసిన దుర్యోధనుడు చివరికి తన పతనాన్ని రుచి చూడడమే కాదు, తనకత్యంత ప్రియతముడైన రాధేయుడిని కూడ యుద్ధంలో కోల్పోవాల్సి వచ్చింది.

ధర్మం అన్నది అందరికీ అందుబాటులో ఉన్నదీ, సమాజంలో మనిషి మనిషినీ ధృడంగా బంధించే శక్తి. భగవంతుని చేరడానికిది ప్రథమ సోపానం. తద్వార మానవుడికి మోక్షద్వారము, అనంతానందప్రదాయిని, నిరంతర శాంతినిచ్చేది, దివ్యజ్ఞానాన్ని సముపార్జించి పెట్టేది ఈ ధర్మవర్తనమే. ధర్మాచరణ మానవుని పరిపూర్ణవ్యక్తిని చేస్తుంది. అతనిలోని శక్తిసామర్థ్యాలను ద్విగుణీకృతం చేస్తుంది. ధర్మపథం ఎంత బాధామయమైనా, దీనికోసం ఎన్ని



పరీక్షలు ఎదుర్కోవాల్సి వచ్చినా ఈ పథంనుండి మానవుడు తొలగిపోరాదు. ధర్మానికి తల ఒగ్గినవాడు ఏనాటికైనా సద్గుణ కోవిదుడుగా ప్రకాశిస్తాడు. దీనికి కావాల్సిన ప్రథమ సోపానము మానవుడు నిజాయితీతో తన స్వధర్మాన్నాచరించడం. ఈ స్వధర్మం అన్నది మానవుడి మానసిక నైతిక స్థాయిని బట్టి ఉంటుంది.

మానవుడు బాహ్యంగా ఆచరించే కర్మలు, నిష్ఠలు, నైతికాభివృద్ధికి ప్రారంభకాలు మాత్రమే! ఇవి మానవుడుకి అడుగడుగునా ధర్మాన్ని గుర్తుచేస్తూ ఉన్నత విలువలవైపు పయనింపచేస్తాయి. ఉదాహరణకి నైవేద్యం అన్న కర్మద్వారా మానవుడు త్యాగగుణాన్ని అలవరచుకోవాలి. ఉన్నదానిలో ఇతరులకు ఇవ్వడంద్వారా మానవుడు దానగుణాన్ని పెంపొందించుకోవాలి. ఉపవాసంద్వారా ఆత్మనిగ్రహం అలవాటు చేసుకోవాలి. మౌనాన్ని పాటించడం అన్న చర్యద్వారా నాలుకను, ఆలోచనలను నిగ్రహించుకోవడం అలవాటవుతుంది. ఈ విధంగా ప్రతి నిష్ఠాగరిష్ఠమైన చర్య, ఏదో ఒక ఉన్నత విలువను సాధించడానికి నిర్దేశితమై ఉన్నప్పుడు, మొదట్లో చర్యకే ప్రాధాన్యతనిచ్చినా, దాని వెనుక ఉన్న విలువపై మానవుడు మనస్సు కేంద్రీకరించాలి. ఉన్నత విలువలు మానవుడిలో స్వచ్ఛతను, పవిత్రతనూ పెంపొందిస్తాయి. ఇవి అత్యంత పవిత్రుడైన భగవంతుని చేరడానికి అత్యవసరమైనవి. ఇవి ఆత్మకు ఆభరణాలుగా ప్రకాశిస్తాయి. ధర్మాలకు వర్తియైన మానవుడు చెడును గురించి ఆలోచించడు. సుఖదుఃఖాలను సమంగా చూడడంవల్ల, అన్ని సమయాలలోనూ ద్వంద్వాతీతుడుగా, స్థితప్రజ్ఞుడుగా ఉండిపోతాడు. యక్షుడడిగిన ఎన్నో ప్రశ్నలకు సముచితంగా సమాధానాలిచ్చిన ధర్మరాజును, మాయాసరోవరంలోని నీళ్ళు త్రాగి విగతజీవులై పడిఉన్న నలుగురు సోదరులలో ఏ ఒక్కరినైనా తాను బతికించగలనని, కోరుకోమని అంటాడు. దానికి ధర్మరాజు నకులుని బ్రతికించమంటాడు. ఇదివిన్న యక్షుడు ఆశ్చర్యంతో, ధర్మరాజుకి ప్రియతమ సోదరులు, అత్యంత శక్తిసమన్వితులు, భావి కురుపాండవయుద్ధంలో ఏదైనా చేయగలిగిన సమర్థులైన భీమార్జునులను కాదని నకులుని ఎందుకు కోరుకున్నాడని ప్రశ్నించినప్పుడు దానికి ధర్మరాజు "కుంతిపుత్రులలో నేను జీవించి ఉన్నాను. మా తండ్రి పాండురాజు రెండవభార్య మాద్రీ కొడుకులలో ఒకరు జీవించడం ధర్మం కదా!" అని సమాధానమిస్తాడు. ధర్మరాజుయొక్క ఈ ధర్మవిచక్షతకు ముగ్ధుడైన యక్షుడు ధర్మరాజు సోదరుల నందరిని పునరుజ్జీవితులను చేశాడు.

సుఖసంతోషాలకు కీలకమైనది, మూలస్థానమైనది ధర్మంతో కూడుకున్న మానవుడి ప్రవర్తన మాత్రమే అని అందరూ గుర్తించాలి. ప్రభు సమ్మితాలైన మనవేదాలు 'ధర్మంచర' అని ఈ అంశాన్నే శాసించి పలికాయి. మన పురాణాలు, ఇతిహాసాలు, భారత, రామాయణ, భాగవతాది మహాగ్రంథాలు పాత్రల ప్రవర్తన ద్వార సంభాషణల ద్వార ధర్మాచరణము ఎటువంటిదో దాని సత్ఫలితాలు ఎలా ఉంటాయో చాటి చెప్పాయి. కనుకనే పైమూడు గ్రంథాలను మన పూర్వులు ధర్మశాస్త్రాలని, వాటిలో చెప్పిన విధంగా నడుచుకుంటె మానవుడు మనశ్శాంతిని, మోక్షాన్ని పొందగలడని నొక్కి చెప్పారు. వారు చూపిన మార్గమే సర్వదా, అనుసరణీయమూ, ఆదర్శప్రాయంగా గ్రహించాలి.

2015, జూలై నెలలో
తిరుమల తిరుపతి దేవస్థానముల
ఉత్సవవిశేషాలు

17	శ్రీవారి ఆణివర ఆస్థానం
20	మరీచిమహర్షి జయంతి, నాగచతుర్థి
21	గరుడ పంచమి
24	తిరుమల శ్రీవారు అహోబిలమఠంలోకి వేంచేయుట
27	తొలి ఏకాదశి, శయన ఏకాదశి, చాతుర్మాస్య వ్రతారంభం
28	తిరుపతి కపిలేశ్వరస్వామివారి పవిత్రోత్సవ ప్రారంభం
31	వ్యాసపూర్ణిమ

శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం , పాకాల


మనదేవాలయాలు

గోపాల్ శ్రీహరి, పాకాల, 9390971246

చిత్తూరు జిల్లాలో తిరుపతికి 40 కి.మీ. దూరంలో పాకాల గ్రామం ఉంది. ఇక్కడి ఊట్లవారిపల్లిలోని పాళ్యం కొండపై శ్రీవల్లీ, దేవసేనా సమేతుడైన శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారు కొలువైఉన్నారు. ఈ దేవాలయం చిత్తూరు జిల్లాలోనే ప్రసిద్ధ సుబ్రహ్మణ్యస్వామిక్షేత్రంగా పేరొందింది. ఈ స్వామిని దర్శించుకుంటే కోరినకోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢవిశ్వాసం. దాదాపు 200 సం॥ల క్రితం స్వామివారికి ఆలయం నిర్మించబడింది.

స్థలపురాణం :

పల్లవదొరల ఏలుబడిలో ఉన్న ఈ పాళ్యంకొండ శేషాచలం కొండల్లో ఒక భాగంగా చెప్పవచ్చు. పూర్వం ఇక్కడ మునులు, సన్యాసులు నిత్యం తపస్సు చేసుకుంటూ కాలం గడిపేవారు. సంతానం లేమితో బాధపడుతున్న సిద్ధాచ్చారి దంపతులు నిష్ఠతో ఈశ్వరుణ్ణి ధ్యానించగా వారికి ఒక శుభదినాన పుత్రసంతానం కలిగింది. పుత్రునికి పాలవరాయుడుగా నామకరణం చేశారు. తన 11వ సంవత్సరంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన పాలవరాయుడు ఈ కొండపైనే ఉంటూ, సుబ్రహ్మణ్యస్వామిని





తలచుకుంటూ తపస్సులో పూర్తిగా లీనమయ్యాడు. అలా ఎన్నో ఏళ్లు గడవగా ఒకరోజు హఠాత్తుగా స్వామి సాక్షాత్కరించి, నీ భక్తికి మెచ్చితిని, ఏ వరం కావాలో కోరుకోమని కోరగా ఆయన ‘‘మీ దర్శనభాగ్యంతో నా జన్మ తరించిందనీ, నా తపస్సుతో మీ సాక్షాత్కారానికి గుర్తుగా తమరు దేవేరులతో వెలసి, భక్తులను అనుగ్రహించ వలసిందిగా కోరాడు. అప్పుడు స్వామివారు అనుగ్రహించి, రాబోవు కాలంలో ఒక స్వర్ణకారుడి చేతిమీదుగా దేవాలయం నిర్మితమవుతుందని చెప్పి, మోక్షం ప్రసాదించి, అంతర్ధానమైరి.



ఆ తర్వాత కొంతకాలానికి పాకాలలో నివాసముంటూ దీర్ఘకాలికరోగంతో బాధపడుతున్న స్వర్ణవ్యాపారి మేలిపాటి

మునస్వామి ఆచ్చారికి స్వప్నంలో స్వామివారు కనిపించారు. పాళ్యం కొండపై గల దొనలోని తీర్థం స్వీకరించి, ఆ స్థానంలో తనకు ఆలయం కట్టుమని చెప్పారు.



ఆ ప్రకారం మేలిపాటి మునస్వామి ఆచ్చారి దొనలోని నీటిని తీర్థంగా స్వీకరించగా వారికి గల రోగంనుంచి ఉపశమనం పొందాడు. అతను ఈ విషయాన్ని పరిసర గ్రామాలలోని ప్రజలకు తెలిపి, అందరి సహకారంతో కొండపై శ్రీవల్లీదేవసేనా సమేతుడైన శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారి దేవాలయం నిర్మించారు. అప్పటి నుండి మహిమలు గల ఆలయంగా ఈ క్షేత్రం ప్రసిద్ధికెక్కింది.

ప్రతి సంవత్సరం ఆడికృత్తిక సందర్భంగా ఐదురోజులపాటు బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఆడికృత్తిక ఉత్సవం నాడు వేలాదిసంఖ్యలో భక్తులు పుష్పకావడులు సమర్పించి, 'హరోహర' నామస్మరణం చేస్తూ – భక్తిగా సేవిస్తారు. ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుత్తణికి వెళ్లలేనివారు పాకాలకు వచ్చి, స్వామిని దర్శించి, మొక్కులు తీర్చుకొంటారు. తిరుపతినుంచి పాకాల రావడానికి విరివిగా బస్సు, రైలు సౌకర్యం ఉంది.

ధారావాహిక
46

మందార మకరందాలు



కన్నియమీఁద నా వలఁపు గాఢము; కూరుకు రాదు రేయి నా
కెన్నఁడు, నా వివాహము సహింపక రుక్మి తలంచు కీడు - నే
మున్నె యెఱుంగుదున్; బరుల మూఁక లడంచి కుమారిఁదెత్తు, వి
ద్వన్నుత! మాను ద్రచ్చి, నవవహ్నిశిఖన్ పడిఁ దెచ్చుకైవడిన్.

రుక్మిణి పంపిన సుదీర్ఘ సందేశాన్ని విన్నాడు. అలవోకగా నవ్వుతూ మూడుముక్కల్లో తన అభిప్రాయాన్ని వెల్లడించినాడు - కృష్ణుడు. తన మనసంతా ఆ కన్నియ పైనే ఉందన్నాడు. తనకు నిదురే లేదన్నాడు. రుక్మి వక్రబుద్ధి తనకు తెలుసునన్నాడు. ఎవ్వరెదురొడ్డినా తన మనోహారిణిని హరించి తెస్తానని ప్రతిజ్ఞ చేసినాడు. ఏ రకంగా? జమ్మికొయ్యలను రాచి, హోమాగ్నిని సాధించినట్టుగా. చిన్న సెలయేరుగా ప్రారంభమైన ఈ పద్యం మహాజలపాతంగా పరిణమించింది. అందరు ప్రేమికులు అన్నట్టుగానే అన్నాడు - కృష్ణుడు -- "ఆ అమ్మాయిని నేను విపరీతంగా ప్రేమిస్తున్నాను. ఆమెను తలచుకోని గడియ లేదు. రాత్రుల్లో నిద్ర రావడం లేదు" అన్న ధోరణిలో. కానీ, ప్రతిజ్ఞ చేసేసరికి, అందుకు తగ్గ గంభీరమైన ఉపమానం వేసేసరికి పద్యం కొండంత పెరిగిపోయింది.

యజ్ఞానికి కావలసిన అగ్నిని జమ్మికొయ్యలను రాచి, పుట్టిస్తారు. రుక్మిణి అలాంటి అగ్ని. రుక్మిణీహరణం యజ్ఞకార్యంవంటిది. ఈ పద్యానికి ప్రాణం ఈ అలంకారధ్వని.

"కూరుకు రాదు" అనేది తెలంగాణంలో వాడుకలో ఉన్న పలుకుబడి.

- జ్ఞానపీఠఅవార్డు గ్రహీత, పద్మభూషణ్ డా।। సి. నారాయణ రెడ్డి



తిరుమల ఆలయం




ఆంగ్లమూలం : డా॥ రమేశన్, తెలుగు అనువాదం : కీ.శే. డా॥ కోరాడ రామకృష్ణ

స్వామి దర్శనం ఎవరో చేసుకునేది కాదు. ఎవరో చేయించేది కాదు. ఆ పరమపురుషుడు ఇచ్చేది. దానికై మనం యాచన చేయాల్సిందే! అతడుమాత్రం అందరికీ ఇవ్వగలడు. ఈ తత్త్వాన్ని డా॥ రమేశన్‌గారు ఈ ఉపసంహారభాగంలో వివరించారు.

శ్రీవేంకటేశ్వరస్వామి ప్రాధాన్యం

శ్రీవారిని దర్శించిన ఎవ్వరికీ దేవుడు ఉన్నాడో లేడో అనే సందేహం రాదు. పాశ్చాత్య శిక్షణం, తర్ఫీదు, దృష్టి కలిగిన పలువురు పరమాత్మగురించి పరిప్రశ్నలలో మునిగి, వాటిని ఎలా పరిష్కరించుకోవాలి అని మార్గాన్వేషణ నిరతులై ఉండగా, ఏడుకొండలస్వామివారి అన్వేషణను పూర్ణం చేసి, వారి మానసిక దృక్పథాలను దిగంత విశ్రాంతంగా విస్తరించి, వారిని ఒక సమాధానస్థాయికి తెచ్చి నిలుపుతాడు – అనే మాట అతిశయోక్తి కాదు. నాశం కాని అన్ని విషయాల ఏకత్వమే ఆయన. మనిషి తానెవరు అని తెలియచేయడానికి అతనిని స్పృశించి చెప్పే స్వామిని నిజంగా దర్శించినవాడు తన జీవితంలో ఎవ్వరినీ ద్వేషించలేడు. అందరూ స్వామిని చూచేందుకు వస్తారు. పెండ్లి కానివారు, పతివిహీనులు, పత్నీవిదూరులు, దరిద్రులు, ధనవంతులు, పనివారు, పనిలేనివారు, వారి వారి భక్తికి తగ్గట్టుగా ఆయన దర్శనంతో సమాధానం, సాంత్వనం పొందుతారు. అందరూ అతనికి సమానమే అన్నపుడు వారిలో పరస్పర భేదమేమిటి? వారి కోరికలు ఏమైనా ఉండుగాక! స్వామిదర్శనమైన తరువాత వారందరూ కొత్త మనుషులై బయటకు వస్తారు. వారి కోరికలు నెరవేరుతాయి. లేకపోయినా మనఃశాంతి దొరికేది ఖాయం. ఏమి వచ్చినా ఎదిరించేశక్తి, ధైర్యం ప్రాప్తి అయ్యేది ఖాయం.

అతని దర్శనం అనేది ఒక ఆధ్యాత్మిక అనుభవం. తమ కోరికలతో పోయినవారంతా అతణ్ణి చూచి వస్తారు. కళ్ళల్లో నీరుండవచ్చు; ఐతే హృదయంలో సాత్త్విక సమాధానం నిండిఉంటుంది. దైవమహిమ అంటే ఈ వాచామగోచరమైన తృప్తిభావాన్ని ప్రతియొక్క భక్తుడూ పొందేలాగ చేయడం. దీనివల్ల భక్తిగౌరవాలతో, నమ్మకం భరోసాలతో, అతనివైపు తిరగడం సులభమౌతుంది. పొడుగాటి ప్రశ్నపత్రాలతో ఆయన దగ్గరకు వెళ్ళినవారు ఏ ప్రశ్న వేయకనే వెనుదిరిగిన ఉదంతాలున్నాయి. శ్రీవారిసన్నిధిలో ప్రశ్నించాల్సిన అవసరమే కనబడదు.





శ్రీవారి ముఖముద్ర చిరుగెంపు నలుపు రంగులతో కూడి ఒక సూక్ష్మమైన ఆధ్యాత్మిక శోభను ప్రకటిస్తుంది. ఆ ముఖభావం సాధారణ సుందరం. ఆ కనులు విశేష సుందరం మరియు శాంతం. మధ్యకాలీన మునులను తలపింపజేసే ఆ రూపంలో ఏదో అగాధమైన గొప్పతేజం – పైన కనిపించేదానికంటే వేరైన తేజం – ఉందనిపిస్తుంది. మనం పవిత్రం అని భావించే అన్ని వస్తువిషయాల తపోనిధి ఆయన. నిజమైన ధర్మం మరియు ఉపనిషత్తులసార సర్వస్వం. ఆయన మూలకంగానే వాచామ గోచరమైన పరమాదర్శం బహిర్గతమౌతుంది. మనం సాధారణ ప్రాణిమాత్రులమే కాదు; అతని అంశగా ఉన్నాము అని ఆయన తెలియజేస్తాడు. అతణ్ణి చేరడమే పరమగమ్యం అని, తెలియపరస్తుంది. ఈ కలియుగంలో మనిషిని ఉద్ధరించడానికే ఆయన కొండపై వెలిసాడు. పూర్ణమనస్సుతో సాక్షాత్కారాన్ని కాంక్షించువారు అతనినుండి పరమ తత్త్వాన్ని పొందుతారు. మనః పరిపాకం శుద్ధంగా ఉంటే మనలో భక్తిని ఆయనే పెంచుతాడు. స్వల్పకాలానంతరం అన్ని కోరికలూ, కనుమరుగై, సాధనపట్ల ఆసక్తికూడా సన్నగిల్లి, అతనికి శరణాగతులు కావడంమాత్రమే అపేక్ష అయి నిలుస్తుంది. శ్రీవారి ఆలయంలో నిరంతరమైన శాంతి, ఆనందం కాంక్షించే అపేక్ష కలుగుతుంది. కొంతకాలం తరువాత తను మనఃసంపూర్ణ సమర్పణం జరుగుతుంది. దైవం బహుసూక్ష్మంగా, ఖచ్చితంగా త్రోవ చూపుతుంది అనేది స్పష్టం, అతనిలో శరణాగతులైన వారికి సాఫల్యసిద్ధి కలుగుతుందనే మాట కేవల వేదాంతమే కాదు – అనేకుల అనుభవ సిద్ధాంతంకూడ! మనం మనలోని పాపపంకిలమైన, విషయపూరితమైన, ప్రతిరోధం చేసే మనస్సును అతనిలో సమర్పణ చేస్తే చాలు; అతనిచే అమూల్యమైన దయ, కరుణ, సానుభూతులను పొంది, ఉద్ధరింపబడుతామనడంలో సందేహం లేదు.

"వేంకటాద్రి సమంస్థానం
బ్రహ్మాండేనాస్తి కించన ।
వేంకటేశ సమోదేవో
న భూతో న భవిష్యతి ॥"

'తిరుమల ఆలయం' సంపూర్ణం.

2015 జూలై నెల రాశిఫలాలు



మేషరాశి

కుటుంబ విషయాలపై శ్రద్ధ అవసరం. అన్యుల ప్రమేయంవల్ల మాట పట్టింపులు. వివిధరకాలైన ఆరోపణలు. పెద్దవారి ఆరోగ్యవిషయమై ఆందోళన. విద్యార్థులకు, విద్యా సంబంధ ఉద్యోగులకు, అధికారులకు అనుకూల సమయం.



వృషభరాశి

నూతన వస్తు, వస్త్రాలకై ధనవ్యయం. పితృమూలక సౌఖ్యం. కోర్టు సంబంధ వ్యవహారాలలో ప్రతిష్ఠంభన. మాటకు విలువ లేకపోవుట.



మిథునరాశి

శరీర ఉష్ణం పెరుగుట, దుస్స్వప్నాలు, కుటుంబ సభ్యులనుండి అప్రియ వాక్యాలు ఉంటాయి. మనశ్చాంచల్యం, కొన్ని సందర్భాలలో విపరీత ధోరణులు.



కర్కాటకరాశి

సోదరమూలకంగా ధనవ్యయం. విద్యా, వ్యాపార రంగాలవారికి, పై అధికారులతో కత్తిమీద సాము. ప్రతి వ్యవహారంలో ఆలోచించి, ముందుకు సాగాలి. జాగ్రత్త.



సింహరాశి

మనోవిచారం, భోజన అసౌకర్యం, ఆరోగ్య సమస్యలు కలుగుతాయి. ప్రతి విషయంలోనూ తొందరపాటుతో ఉంటారు. సంతానంగూర్చిన శుభవార్తలు.



కన్యారాశి

చేయని పనికి వివరణ ఇచ్చుకోవడం, ప్రముఖుల వ్యయం, సంతాపం, సోమరితనంవల్ల ముఖ్యకార్యం చేదాటి పోతుంది. విద్యార్థులకు కృషివిఘ్నాలు, ఆలోచనలు ప్రక్కదారి పట్టుట. అనవసర వ్యవహారాలలో ఆసక్తి.




తులారాశి

ఆప్తులకొరకు శ్రమపడతారు. సోదర, బంధు, మిత్రులతో నూతన విభేదాలు తలెత్తగలవు. పశు, ధననష్టం, ప్రభుత్వోద్యోగులకు ఇంక్రిమెంట్లు, బోనస్‌లు.



వృశ్చికరాశి

మనోవ్యాకులం, ఆందోళన, యత్నపూర్వక ధనలాభం, విద్యార్థులకు శుభ సమయం. నిల్వ వ్యాపారాదులు కలసిరావు. కాంట్రాక్టర్లకు అధిక ధనవ్యయం.



ధనూరాశి

అత్యంత ఆప్తులతో విరోధం, చేసే వృత్తి వ్యాపారాలలో నిరుత్సాహం. ఉద్యోగులకు పై అధికారులనుంచి ఒత్తిళ్ళు. వైరాగ్య భావనలు. అన్ని విధాలుగా మీకంటే చిన్నవారినుంచి సహాయం పొందాల్సి వస్తుంది.




మకరరాశి

ధన ధాన్య, వస్త్ర లాభాలు, కుటుంబ వాతావరణంలో ఉల్లాసం, బంధుమిత్రులతో సత్సంబంధాలు, శుభకార్యాలు చేయడం, పిల్లలకు పాఠశాల మార్పిడులు, ఉద్యోగులకు పై అధికారుల ఆకస్మికతనిఖీలు.




కుంభరాశి

కోపతాపాలు, తద్వారా అనూహ్య సంఘటనలు, చిక్కులు, సరదా సంభాషణలు వికటించడం, అనాలోచనతో చేసే నిర్ణయాలు దుష్ఫలితాలు కల్గిస్తాయి.



మీనరాశి

స్వజన విరోధం, నిర్మాణ రంగంలోని ఉద్యోగులకు ప్రభుత్వంవారిచే ఇంక్రిమెంట్లు మరియు బోనసులు ఉంటాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. దైవచింతన కలిగి ఉంటారు. పుత్ర, కళత్ర, బంధు సౌఖ్యం.



**దానం ప్రియ వాక్సహితం
జ్ఞాన మగర్వం క్షమాన్వితం శౌర్యమ్
త్యాగ సహితం చ విత్తం
దుర్లభ మేత చ్చతుష్టయమ్ ॥**

డా॥అప్పజోడు వేంకటసుబ్బయ్య,
పూర్వకార్యదర్శి, హిందూధర్మప్రచార పరిషత్తు,
తి.తి.దే., 9014878108

ఇవి హితోపదేశంలో నారాయణసూరిగారు చెప్పిన మాటలు. ఈ హితోపదేశాన్ని తెలుగులోకి అనువదించినవారు శ్రీ దూబగుంట నారాయణకవిగారు.

ప్రియ వాక్కుతో కూడిన దానం, గర్వం లేని జ్ఞానం, క్షమతో కూడిన శౌర్యం, త్యాగంతో కూడిన ధనం లోకంలో ఉండటం అరుదట.

దానగుణం గొప్పదే. ఇది ఇహపరాలు రెండింటికి మేలు చేసేదే. అందుకే హైందవం శుభాశుభాలు రెండింటిలో దానాలను భాగంగా చేసింది.

దానంగా ఏమి ఇస్తున్నావు? ఎంత ఇస్తున్నావు? అన్నది ముఖ్యం కాదు. ఇస్తున్న దానం ఏ ఉద్దేశంతో ఇస్తున్నావు? ఎలా ఇస్తున్నావు? అన్నదే ముఖ్యం. దాని పవిత్రతను, ఫలాన్ని నిర్ణయించేవి కూడా ఇవే. ఇచ్చే దానం వెనుక అహంకారం గాని, ప్రచార కాంక్ష గాని, ప్రయోజనాపేక్ష గాని ఏమాత్రం ఉండకూడదు. దానం ఇవ్వగలిగిన శక్తి, ఇచ్చే అవకాశం తనకు లభించటం ఎంతో అదృష్టమన్న భావన ఉండాలి. భగవదర్పణ బుద్ధితో దానం చెయ్యాలి. అంతేకాదు, న్యాయార్జిత ద్రవ్యాన్నే దానంగా ఇవ్వాలి. యోగ్యుడైన వ్యక్తికే దానం చేయాలి. అప్పుడే చేసిన దానానికి ఒక పవిత్రత – సార్థకత.

కాగా దానం ఇచ్చే తీరుకూడా బాగుండాలి. దానం ఇస్తూ – పుచ్చుకునే వ్యక్తితో అప్రియంగా మాట్లాడకూడదు. అతని మనస్సు నొప్పించకూడదు. అలా చేస్తే దాన పవిత్రత, దాన ఫలం రెండూ దూరమౌతాయి. కాని, లోకంలో చాలామంది అప్రియంగా మాట్లాడి దానాలిస్తారు. అందుకే కవిగారు ఆ శ్లోకంలో ప్రియవాక్కుతో కూడిన దానం దుర్లభమన్నారు. అప్రియంగా మాట్లాడి చేసే దానం అపవిత్రమని ధ్వనింపజేశాడు.

ఇక జ్ఞానం. ఇటుకల కుప్ప ఎలా ఇల్లు కాదో, కేవలం విషయసేకరణమాత్రమే విజ్ఞానం కాదు. సేకరించిన విషయాలను విశ్లేషించి, విషయ తత్త్వాన్ని దర్శించి, దాన్ని పరిపూర్ణంగా జీర్ణించుకొన్నప్పుడే అది జ్ఞానమౌతుంది. పశుత్వాన్ని పారద్రోలుతుంది. రాక్షసత్వాన్ని రూపుమాపుతుంది. మానవత్వాన్ని పండిస్తుంది. దివ్యత్వాన్ని వెలిగిస్తుంది. అందుకే గీత “నహి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే” అని ప్రబోధించింది.

అయితే జ్ఞానానికి గర్వం అంటకూడదు. గర్వం అంటితే అది అపవిత్రమౌతుంది. గౌరవాన్ని కోల్పోతుంది. నిజానికి జ్ఞానం గర్వాన్ని పారద్రోలాలి. వినయవిభూషితం కావాలి. అప్పుడే జ్ఞానానికి గొప్పవెలుగు.

కాని, చిత్రమేమిటంటే లోకంలో ధనగర్వితులతోపాటు, అధికార గర్వితులతోపాటు, జ్ఞానగర్వితులు కూడా అధిక సంఖ్యలో ఉన్నారు. అందుకే హితోపదేశకర్త గర్వంలేని జ్ఞానం దుర్లభం అన్నాడు. గర్వంతో కూడిన జ్ఞానం గౌరవార్హం కాదని ధ్వనింపజేశాడు.

శౌర్యం – ఇది కూడా ఉండతగిందే. మెచ్చుకోతగిందే. ఆత్మరక్షణకు, శత్రుశిక్షణకు, ధర్మపాలనకు ఇది ఎంతో అవసరం.

కాని, శౌర్యం క్రౌర్యంగా మారకూడదు. కసితో కలుషితం కాకూడదు. శౌర్యానికి క్షమించే గుణం ఉండాలి. ప్రబల శత్రువైనా సరే పాదాలమీద పడితే అతణ్ణి క్షమించగల ఔదార్యం శౌర్యానికుండాలి. అప్పుడే శౌర్యానికి శోభ. క్షమాగుణంతో కూడుకొన్నది కాబట్టే శ్రీరామచంద్రుని శౌర్యం లోకానికి ఆదర్శం.

లోకంలో చాలామంది శూరులు క్షమాగుణం లేనివారే. కసితో ఊగిపోయేవారే. అందుకే హితోపదేశకర్త క్షమాన్వితమైన శౌర్యం దుర్లభమన్నాడు. క్షమాగుణం లేని శౌర్యం హింసకు దారితీస్తుందని, పాపహేతువు అవుతుందని పరోక్షంగా సూచించాడు.

ఇక విత్తం – అంటే ధనం. ధనార్జన మనిషి మనుగడకు అవసరమే. అయితే అది ధర్మమార్గంలోనే సాగాలి. లేకుంటే పాపం అంటుతుంది. చిత్రమేమంటే – మనిషికి ధనార్జన గుణం ఎక్కువ. అంతకంటే ఎక్కువ కూడబెట్టే గుణం. అన్నింటికంటే ఎక్కువ కూడబెట్టినదాన్ని అంటిపట్టుకునే గుణం. ఈ అంటిపట్టుకునే గుణమే అతణ్ణి ఆధ్యాత్మికంగా ఎదుగనీయకుండా ఐహికానికి కట్టివేసే బంధం – పెద్ద బంధం. ఈ బంధం తొలగాలంటే, అతడు ఆధ్యాత్మికంగా ఎదిగి, అమృతత్వాన్ని పొందాలంటే త్యాగగుణాన్ని తప్పక పెంపొందించు కోవాలి. వేదంకూడా త్యాగంవల్లనే కదా అమృతత్వం సిద్ధిస్తుందని చెప్పింది. "త్యాగే నైకే అమృతత్వ మానశుః".

కాని, లోకంలో చివరి శ్వాసదాకా ఆర్జించిన విత్తాన్ని అంటిపట్టుకొనే వాళ్ళే ఎక్కువ. ఇబ్బందుల్లో ఉన్నవాళ్లకు ఏమాత్రం ఇవ్వని వాళ్ళే ఎక్కువ. అందుకే హితోపదేశకర్త త్యాగహిత విత్తం దుర్లభమన్నాడు. త్యాగరహిత విత్తం పెద్ద ఐహిక బంధమని, మనిషి ఆధ్యాత్మికోన్నతికి అది ప్రబల ప్రతిబంధకమని పరోక్షంగా ప్రబోధించాడు.

మానవోన్నతికి దోహదం చేసే ఈ హితోపదేశశ్లోకం ప్రతి మనిషి తెలుసుకోదగ్గది.

శ్రీ వేంకటేశ్వర నతులు

ఊహ కందరాని యుజ్జ్వల మూర్తివి
ప్రేమ కందరాని ప్రియతముడవు
నిన్ను పొంద వశమె నీరదశ్యామాంగ
వేదవేద్య! నతులు వేంకటేశ!

కాంతిమూర్తి వీవు కల్యాణసౌందర్య!
శాంతిమూర్తి వీవు శార్ఙ్గపాణి!
నీదు విక్రమంబు నిర్ణయింపగలేరు
వేదవేద్య! నతులు వేంకటేశ!

కర్ణభూషణములు కలిగిన గుణములు
వర్ణసమ్ముదములు వరలు రూపు
సుగుణ వర్ణన మది శోభించు సత్కీర్తి
వేదవేద్య! నతులు వేంకటేశ!

రూపమెంతొ కాంతి రుక్మిణీవల్లభ!
రోష మెంతొ యింపు రుక్మిబావ!
ధర్మయుద్ధమందు ధర్మావతారుడ!
వేదవేద్య! నతులు వేంకటేశ!

శాంత భృత్య జనుల శరణీయుడవు నీవు,
దాంతిగర్వపరుల దర్పహరణ!
ధర్మముద్ధరించు ధార్మికసంస్కర్త!
వేదవేద్య! నతులు వేంకటేశ!

గరుడవాహనమున గమ్యమ్ము చేరియు
శత్రుభావములను సమయజేసి,
ముక్తి నిచ్చు నట్టి మోక్షప్రదాయక!
వేదవేద్య! నతులు వేంకటేశ!

మంచిమార్గ మిచ్చు మనుగడ గల్గించు
దుష్టభావములను తొలగజేయు
జగతి సేవచేయు జాగృతి గల్గించు
వేదవేద్య! నతులు వేంకటేశ!

బలివాడ అప్పారావు, ఖరగ్‌పూర్, 03222 – 234227

శ్రీమన్నాథమునులు

డా॥ చక్రవర్తి రంగనాథన్, అసోసియేట్ ప్రొఫెసర్, రాష్ట్రియ సంస్కృతవిద్యాపీఠం, తిరుపతి, 9440919186

నాథేన మునినాథేన భావేయం నాథవా నహమ్।

యస్య నైగమికం తత్త్వం హస్తామలకతాం గతమ్॥

శ్రియఃపతియైన శ్రీమన్నారాయణుడు లోకోజ్జీవనం కొఱకు అనేక విధములైన అవతారాలను స్వీకరించి శిష్టరక్షణ, దుష్టశిక్షణ, సాధుపరిత్రాణాదులను గావించి ఆశ్రితవత్సలుడుగా, ఆశ్రిత రక్షకుడిగా భక్తులచేత కొనియాడబడుతున్నాడు. కృత–త్రేతా–ద్వాపరయుగాలలో అవతరించిన శ్రీమన్నారాయణుడు కలియుగంలో తాను అవతరించక తన దివ్యాయుధాభరణాలను భూలోకంలో అవతరింపజేశాడు. ఆ విధంగా అవతరించినవారే 'ఆళ్వారులు' గా కొనియాడబడుతున్నారు.



జూన్ 29 శ్రీ నాథమునుల వర్షతిరునాళ్

ఆచార్య సార్వభౌములలో అగ్రగణ్యులు శ్రీమన్నాథమునులు

శ్రీవైష్ణవ సంప్రదాయంలో ఆచార్యుడే సర్వోత్తముడు. ఆచార్యునిద్వారానే భగవదనుగ్రహం కలుగుతుంది. ఆచార్యునియొక్క కృపకు పాత్రుడు కానివాడు భగవత్కృపావిహీనుడగును. అందుకే శ్రీ వేదాంతదేశికులవారు–

"గురుభ్యః తద్గురుభ్యశ్చ నమోవాకమ్అధీమహి।

వృణీమహే చ తత్రాద్యే దంపతీ జగతాంపతీ॥

అని గురువులకు తద్గురువులకు మొదటగా నమస్కరించి, అందరికి ఆద్యగురువులైన లక్ష్మీనారాయణులకు నమస్కారం అని తెలియచేయడంచేత ఆచార్యునియొక్క స్థానం మనకు అర్థమవుతుంది.

నాథమునుల అవతారం

జ్యేష్ఠమాసే త్వనూరాధాజాతం శరజిదాశ్రయమ్।

ఉద్ధర్తారం ప్రబంధానాం శ్రీమన్నాథమునిం భజే॥

శ్రీమన్నాథమునులు కావేరీనదీతీరంలో వీరనారాయణ పురం అనబడే తిరుక్కోళూరు (కాట్టుమన్నార్‌కోయిల్) అనే దివ్యక్షేత్రంలో కలియుగం 3264 సంవత్సరములు పూర్తి అయిన తరువాత అనగా (క్రీ.శ.906) శోభకృత నామ సంవత్సరం–జ్యేష్ఠమాసం–అనూరాధ నక్షత్రం–బుధవారం సకలశాస్త్ర పారంగతుడు, విష్ణుభక్తి పరాయణుడైన శ్రీఈశ్వరభట్టార్యులకు (విష్వక్సేనుల గజముఖుడనే కుముదగణేశుని అంశతో) పుత్రులుగా అవతరించారు. వీరికి శ్రీరంగనాథముని అని నామకరణం చేశారు. వంగీపురత్తునంబి అనే వైష్ణవోత్తముని యొక్క పుత్రికయైన అరవిందతో వీరికి వివాహం జరిగింది. వీరికి ఒక పుత్రుడు కలిగాడు. అతనికి 'ఈశ్వరముని' అని నామకరణం చేశాడు.

కొంతకాలం అయిన తరువాత శ్రీమన్నాథమునులకు దివ్యదేశయాత్ర చేయాలని తలంపు కలిగింది. సపరివారంగా మన్నారు రాజగోపాలస్వామి ఆదేశంతో, అనుగ్రహంతో ఉత్తరదేశయాత్ర చేస్తూ, మథురా, బృందావనం, అయోధ్య, బదరీ, వారణాసి మొదలగు దివ్యక్షేత్రాలను సందర్శించి, తరువాత దక్షిణదేశంలో ఉన్న అహోబిలం, సింహాచలం, వేంకటాచలం, కాంచీ మొదలగు దివ్యక్షేత్రాలను సందర్శిస్తూ కుంభకోణంలో వేంచేసియున్న శార్ఙ్గపాణిని దర్శించారు. ఆసమయంలో అక్కడ ఉన్న శ్రీవైష్ణవులు ఎంతో భక్తితో నమ్మాళ్వార్ల దివ్యప్రబంధాన్ని అనుసంధానం చేస్తున్నారు. అందులో విశేషించి "ఆరావముదు" అనే దశకాన్ని పారాయణం చేస్తూ, చివరి పాశురంలో ఈ విధంగా "కుళలిన్మలియచ్చొన్న ఓరాయిరత్తుళిప్పత్తుం" (குழலின்மலியச்சொன்ன ஓராயிரத்துள்லிப்பத்தும்) అని, ఒక వెయ్యిలో ఈపదిపాశురాలను గానం చేసేవారికి సమస్త దుఃఖాలు తొలగి, భగవత్ప్రాప్తి పొందుతారు – అనే తాత్పర్యాన్ని విన్నవెంటనే నాథమునులు ఆ శ్రీవైష్ణవులను మిగతా పాశురాలను గానం చేయండని అడిగితే వారు ఈ పదిపాశురాలు తప్ప మిగతా ఏ పాశురాలు తెలియవు అని చెప్పగా, నాథమునులు మిక్కిలిబాధపడి ఆశార్ఙ్గపాణినే శరణాగతి చేయగా, స్వామి కలలో కనిపించి, కురుకాపురిలోని నమ్మాళ్వార్ల అనుగ్రహంచేత ఆ దివ్యప్రబంధాన్ని పొందవచ్చునని పలుకగా, నాథమునులు కురుకాపురికి వెళ్ళారు. అక్కడ ఎలా నమ్మాళ్వార్ల అనుగ్రహం పొందాలని అక్కడ ఉన్న శ్రీవైష్ణవులను అడుగగా, అందులో ఒక వృద్ధ వైష్ణవుడు "మధురకవి ఆళ్వారులనేవారు పరమదైవంగా భావించి, వారిని స్తుతిస్తూ "కణ్ణినుణ్ శిఱుత్తాంబు" అనే ప్రబంధాన్ని రచించారు. దానిని 12,000 వేల పర్యాయాలు పవిత్రచిత్తంతో జపిస్తే ఆ నమ్మాళ్వార్ల అనుగ్రహం తప్పక కలుగుతుంది" అని చెప్పగా నాథమునులు ఆవిధంగానే చింతచెట్టుక్రింద ఉన్న నమ్మాళ్వార్ల అర్చామూర్తి ఎదుట కూర్చొండి "కణ్ణినుణ్ శిఱుత్తాంబును" 12 వేలసార్లు జపించారు. శ్రీశఠగోపులు వెంటనే ప్రత్యక్షమై నాథమునులకు దివ్యచక్షువునిచ్చి తమ దివ్యప్రబంధాలను కూడ ఉపదేశం చేసారు. అలాగే రహస్యత్రయాన్ని, వేద ప్రతిపాదితమైన విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని కూడ ఉపదేశించి, అంతర్ధానమైనారు. ఇలా లుప్తమైన ఆళ్వార్ల 'నాలాయిర దివ్యప్రబంధం' నాథమునుల ద్వారా ఈ లోకానికి తిరిగి ప్రాప్తమైనది. కనుక నాథమునులు అవతరించకపోయి ఉంటే నాలాయిర దివ్యప్రబంధం మనకు లభించిఉండదు. నాలాయిర దివ్యప్రబంధం లేకపోతే శ్రీ విశిష్టాద్వైతసిద్ధాంతం ఆవిర్భవించి ఉండదు. విశిష్టాద్వైతసిద్ధాంతం లేకపోతే శ్రీమన్నారాయణపరతత్త్వం అంతరించిపోయేది. కనుక శ్రీమన్నాథమునులు శ్రీ వైష్ణవ సంప్రదాయానికి మహోపకారం చేసిన మహనీయులు.

కవితార్కిక సింహులైన శ్రీ వేందాంత దేశికులు "యతిరాజ సప్తతి" అనే స్తోత్రంలో నాథమునులనుగూర్చి అద్భుతంగా స్తుతించారు. అందులో 'ముని' అంటే మననశీలుడు. 'నాథేన ముని నాథవాన్ నాథమునిచే నాథుడు కలవాడను' అని దేశికులు శ్లేషాలంకారం ద్వారా నాథమునులకు నేను పరతంత్రుడనవుతున్నాను అని నొక్కి వక్కాణించారు. అలాగే మననశీలుడై, భగవద్ధ్యాన పరులైన వారికి నాథుడైన నాథమునికి ప్రణామములు అని అర్థం కూడా చెప్పవచ్చు.

ఎలాగైతే విష్వక్సేనులవారు నమ్మాళ్వారుకు ఆచార్యులైనారో అలాగే శ్రీనమ్మాళ్వార్లు శ్రీనాథమునులకు ధ్యానయోగదశలో ఆచార్యులైనారు.

"యస్య నైగమికం తత్త్వం హస్తామలకతాం గతమ్",

ఏ నాథమునికి నిగమసంబంధమైన, వేదప్రతి పాద్యమైన తత్త్వం కరతలామలకమైందో అంటే చేతిలోని ఉసిరికాయవలె సమగ్ర దర్శనీయతను పొందిందో అట్టి నాథమునులు నాకెల్లప్పుడూ ఆశ్రయణీయులు. ఎలాగైతే నదులన్నీ అప్రయత్నంగానే సముద్రంలోకి కలుస్తాయో – అలాగే వేదప్రతిపాదిత తత్త్వార్థాలు అప్రయత్నంగా భగవద్ధ్యానపరులైన నాథమునుల సత్పాత్రతను చూచి, వారి హృదయంలోకి చేరినాయని పెద్దల వ్యాఖ్యానం.

నాథమునులు సంగీతవిద్వాంసులు

నాథమునులు గొప్ప సంగీతశాస్త్రనిష్ణాతులు. నాలాయిర దివ్యప్రబంధానికి రాగతాళాలను సమకూర్చి స్వరసమ్మేళనం చేసి, తమ మేనల్లుళ్ళైన "మేలైయకత్తాళ్వాన్, కీళైయకత్తాళ్వాన్" అనే వార్లకు బోధించి, శ్రీరంగాది దివ్యక్షేత్రాలలో ఈ ప్రబంధాన్ని అభినయంతో పాటు దేవగానం చేయించి ప్రకాశింపచేశారు. ఈ సత్సంప్రదాయం ఈ నాటికీ శ్రీరంగం, శ్రీవిల్లిపుత్తూరు, తిరునారాయణపురం మొదలగు దివ్యదేశాలలో 'అరైయర్చు' అనబడే వారు దేవదేవునిముందు అభినయం చేస్తూ, మధురంగా ప్రబంధాలను దేవగానం చేస్తూ, తన్మయత్వాన్ని పొందుతున్నారు. విశేషంగా అధ్యయనోత్సవాలలో ఈ సంప్రదాయాన్ని మనం చూడవచ్చు. ఈ విషయాన్ని వేదాంతదేశికులవారు తమ 'అధికారసంగ్రహం' అనే దివ్యప్రబంధంలో స్పష్టం చేశారు.

శ్రీమన్నాథమునులవారు రచించిన గ్రంథాలు రెండు. 1.న్యాయతత్త్వశాస్త్రం, 2. యోగరహస్యం. ఈ గ్రంథాలు లుప్తమైనవి. యోగధ్యానసంపన్నులైన శ్రీమన్నాథమునులు ఆళ్వార్ల దివ్యప్రబంధ అనుసంధానంచేత దేవదేవుణ్ణి సాక్షాత్కరించుకొని అమందానందసందోహంలో మునిగేవారట.

తిరువరంగత్తముదనార్చు 'ఇరామానుశనూత్తందాది' అనే దివ్యప్రబంధంలో నాథమునులనుగూర్చి ప్రశంసించారు.

శ్రీమన్నాథమునుల పౌత్రుడు ఈశ్వరముని పుత్రరత్నమైన శ్రీ ఆళవందార్లు తన తాతగారియొక్క వైభవాన్ని తమస్తోత్రరత్నంలో అత్యద్భుతంగా కీర్తించారు.

1. **నమః అచింత్య అద్భుత అక్లిష్ట జ్ఞానవైరాగ్యరాశయే।**
   నాథయే మునయే అగాధభగవద్భక్తి సింధవే॥
2. **తస్మై నమో మధుజిదంఘ్రి సరోజతత్త్వ -**
   జ్ఞానానురాగ మహిమాతిశయాంత సీమ్నే
   నాథాయ నాథమునయేఽత్ర పరత్ర చాపి
   నిత్యం యదీయ చరణౌ శరణం మదీయమ్॥
3. **భూయో నమః అపరిమితాచ్యుత భక్తి తత్త్వ-**
   జ్ఞానామృతాబ్ధి పరివాహ శుభై ర్వచోభిః,
   లోకేఽవతీర్ణ పరమార్థ సమగ్ర భక్తి
   యోగాయ నాథమునయే యమినాంవరాయ ॥

అని భక్తిస్వరూపులు, యోగస్వరూపులు అయిన నాథమునులకు నమస్కారములు అని యామునాచార్యులవారు స్తుతిస్తూ, చివరగా "ఓ దేవ దేవ! శ్రీమన్నారాయణా! నేను ఎన్నో పాపాలు చేసిఉంటాను. నా చరితను మరచి, మాతాతగారైన నాథమునులను మనసులో పెట్టుకొని, నన్ను అనుగ్రహించు స్వామీ!" అని ప్రార్థించారు.

అలాగే ''నాథోపజ్ఞం ప్రవృత్తం'' అని ఈవైష్ణవ సంప్రదాయానికి ఒక గొప్ప గౌరవం ఉన్నది.

అలాగే దివ్యప్రబంధ ప్రారంభంలో ఈ తనియన్ (ప్రత్యేకశ్లోకం) అనుసంధానం జరుగుతుంటుంది.

లక్ష్మీనాథ సమారంభాం, నాథయామున మధ్యమామ్ ।
అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరామ్ ॥

లక్ష్మీవల్లభుడు, లక్ష్మీదేవి, విష్వక్సేనులు, నమ్మాళ్వార్లు, శ్రీమన్నాథమునులు, పుండరీకాక్షులు, శ్రీరామమిశ్రులు, శ్రీ యామునమునులు, పెరియనంబి, శ్రీరామానుజులు అని గురు పరంపరా క్రమం. ఈ ఆచార్యముక్తాహారంలో నాయకమణి స్థానాన్ని అలంకరించినవారు–శ్రీమన్నాథమునులే. కనుక నాథమునులవారు మనకందరికీ వందనీయులు. శ్రీరంగక్షేత్రంలో రాజగోపురం దాటినవెంటనే ఆచార్యసార్వభౌములైన శ్రీమన్నాథమునులవారి ఆలయం ఉన్నది. అలాగే తిరుపతిలో తీర్థకట్టవీథిలో నాథమునుల వారి సన్నిధి ఉన్నది. ఆ వీథికే నాథమునివీధి అని పేరు. ఇచట ఈజ్యేష్ఠమాసంలో అనూరాధ నక్షత్రంలో నాథమునులవారి తిరునక్షత్ర సందర్భంగా శ్రీ గోవిందరాజస్వామి దేవాలయంనుండి శ్రీస్వామివారి అనుగ్రహమాల, వస్త్రాలు మేళతాళాలతో శ్రీనాథమునులవారికి సమర్పింపబడతాయి. నాథమునులవారు లేకపోతే దివ్యప్రబంధం లేదు. దివ్యప్రబంధం లేకపోతే భక్తి, ప్రపత్తి సిద్ధాంతాలు తెలియవు. భక్తిప్రపత్తి సిద్ధాంతాలు తెలియకపోతే భగవచ్చరణారవింద సమాశ్రయజ్ఞానం కలుగదు. కనుక ఇంతటి మహోపకారం చేసిన శ్రీమన్నాథమునులవారిని ఆశ్రయించి, లక్ష్మీనాథునికృపకు పాత్రులవుదాం!

భక్తవత్సలుడు

డి. అనితాసూరి, హైదరాబాదు, 9247500819

మా ఊరు చిత్తూరే కావడంవల్ల, బంధువులంతా తిరుపతిలోనే ఉన్నందున ఎక్కువగా వేసవి సెలవులకు, ప్రతి చిన్న కార్యక్రమాలకు తిరుమలకు వెళ్ళడం అలవాటుగా ఉండేది. తరువాత గ్రూప్ టూ లో సెలెక్ట్ అయ్యి, హైదరాబాదాద్ సచివాలయంలో ఉద్యోగం వచ్చాక, తిరుపతి ప్రయాణం తగ్గింది. ఇక పెళ్ళి జరిగి ఇద్దరు పిల్లలయ్యాక మరీ తగ్గిందనే చెప్పుకోవాలి.

మా పెళ్ళికి మొక్కుకున్న కల్యాణం మొక్కును పెళ్లైన ఐదు సంవత్సరాలకుగానీ తీర్చుకోలేకపోయాము. దూరప్రయాణం! పైగా పిల్లలతో సతమతమవుతూ వెళ్ళడమంటే చాలా ఇబ్బంది పడవలసి ఉంటుందని తప్ప – మరేమీ కాదు. అలా తరువాతో మూడేళ్ళకు కారులో తిరుపతికి ఒక స్థలం కొనుగోలు విషయంగా వెళ్ళాము. ఇన్నేళ్ళకు ఎలాగూ తిరుపతివరకూ వచ్చాము కాబట్టి మళ్ళీ ఎప్పటికి దేవుని దర్శించుకుంటామో కదా! తిరుమలకు వెళ్ళి వస్తే ఆ తృప్తి ముందు మరేదీ సరికాదని బయలుదేరాము. తొమ్మిదేళ్ళ మా పాప ముందు రోజు బాగా సీతాఫలాలు తినింది. ఆమెకు అప్పుడప్పుడూ తలనొప్పికూడా వస్తూ ఉంటుంది. బాబుకు ఎనిమిదేళ్ళు. దర్శనంకోసం వెళ్తుండటంవల్ల తలస్నానాలు చేయించాను.




అసలే కొత్తనీరు, అలవాటు లేకుండా సీతాఫలాలు తినడం, ఇక తలస్నానంకూడా చేయించానేమో–కారు 'రాంబగీచా' సత్రాలకు ముందున్న పార్కింగ్ ప్లేసులో ఆగీఆగగానే మా పాప "మమ్మీ నాకు విపరీతంగా తలనొప్పిగా ఉంది, ఇంటికెళ్ళిపోదాం" అంటూ ఒకటే ఏడుపు. అసలు బయలుదేరకముందే అలా ఉంటే రాకనే మానేసేదాన్ని. నాకు కాళ్ళూ చేతులు ఆడలేదు. ఏంచెయ్యాలో తోచలేదు. ఇంతలో "నాకు వాంతి వస్తోంది" అంటూ గోడవారకెళ్ళింది ఇక నాకు పై ప్రాణాలు పైనే పోయాయి. పాప కళ్ళువాలిపోయినట్లైంది. తలనొప్పికి ముఖంలో కళలేదు. మావారు "సరే మరేంచేద్దాం మనకింతే ప్రాప్తమనుకుని కిందికి వెళ్ళిపోదాం. డాక్టరుకు చూపించాలి" అంటూ నావైపు చూశారు – ఏమంటావ్ అన్నట్టుగా.

నాకేమో ''ఇదేమిటి తండ్రీ! మమ్మల్ని నీదగ్గరికి రప్పించుకున్నట్టే చేసి, ఈ బాధ ఎందుకు పెడుతున్నావు. మేము రావడం నీకు ఇష్టంలేదా? మాకింతే ప్రాప్తమా?" అనుకుంటూ పాపకు ముఖం కడిగించి, నీళ్ల త్రాగించి, మెడిటేషన్ చేసుకొమ్మన్నాను – ఓ పదినిమిషాలపాటూ. మెల్లగా కళ్ళు తెరిచింది" వాంతిలా అనిపించింది కానీ ఇందాక రాలేదు మమ్మీ" అంది కాస్తతెప్పరిల్లినట్టై. "ఏమీ కాదు తల్లీ. 'గోవిందా' అనుకో. గోవిందనామం అన్ని బాధలు తొలగిస్తుంది. ఇంతదూరంవచ్చి దేవుణ్ణి దర్శించుకుంటే నీకే అస్సలు తలనొప్పి గుర్తేరాదు. ఎంత ఓ గంటలో తిరుపతి వెళ్ళిపోదాము సరేనా? నీకు మరీ బాగులేకుంటే వెళ్ళిపోదాములే" అంటూ తనతో చెప్పాను. పాపకూడా నా మాటలకు మెత్తబడి ''అలాగే దర్శనానికెళ్దాం" అంది.


ఓ గంట వేచి ఉన్నాక దర్శనంకోసం వెళ్తుంటే నాకు కడుపులో రకరకాలుగా అనిపించడం మొదలైంది. "దేవుడా ఒకటిపోతే ఒకటిగా ఎందుకు నాకీ అగ్ని పరీక్షలు నీవెలా రాసి ఉంటే నాకలా జరుగుతుంది'' అనుకుని వెనుతిరగకుండా ముందుకే మొండిగా వెళ్ళాను. చాలా బాగా దర్శనం లభించింది.

ఆ తరువాత బయటకు వచ్చి నెమ్మదిగా భోజనం చేసి, ఇంతక్రితం పడిన టెన్షన్లు ఏవీ మాకు అస్సలు అనిపించకుండా చాలా ఉల్లాసంగా తిరుగుప్రయాణమై సాయంత్రానికి తిరుపతిలోని మా ఇల్లు చేరుకున్నాము. అందరికీ అది లీలగా అనిపిస్తుందోలేదోగానీ, నాకు మాత్రం కఠిన పరీక్ష తరువాత ర్యాంకులో పాసైనంతగా అనిపించింది. దేవుని పరీక్షగానే కనిపించింది. భక్తితో బలంగా ఆయన దర్శనాన్ని కాంక్షించి నందువల్ల మా బలమైన కోరికను నెరవేర్చి, మమ్మల్ని పునీతుల్ని కావించారని నమ్ముతూ గోవిందుణ్ణి మన స్ఫూర్తిగా 'సంకట హరణా గోవిందా' అంటూ స్మరించు కుంటున్నాను.






విష్ణుసాలగ్రామ ప్రశస్తి



ఎన్. నాగజ్యోతి, బళ్లారి

సాలగ్రామం శ్రీమహావిష్ణువుకు ప్రతీక. సాలగ్రామాలు గండకీనదిలో లభ్యమవుతాయి. సాలగ్రామానికి అభిషేకించిన జలాన్ని ప్రోక్షించుకుంటే సర్వపాపాలు, సర్వరోగాలు నశిస్తాయి. సర్వసంపదలు కలుగుతాయి. సర్వశుభాలు సంప్రాప్తిస్తాయి. మోక్షం సిద్ధిస్తుంది. భక్తి శ్రద్ధలతో సాలగ్రామాన్ని పూజించి, అభిషేకిస్తే, కోటిలింగాలను దర్శించి, పూజించి, అభిషేకించిన ఫలితం కలుగుతుంది. పూజామందిరంలో, పూజా పీఠంలో సాలగ్రామాన్ని ప్రతిష్ఠించుకొని నిత్యం సమస్తపూజలను సక్రమంగా నిర్వహిస్తే పరిపూర్ణమైనఫలితాలను పొందవచ్చు. సాలగ్రామశిలలలో చరాచరాత్మకమగు మూడు లోకాలు ఉంటాయి. సాలగ్రామపూజ వల్ల శివకేశవులిద్దరినీ పూజించిన ఫలితం కల్గుతుంది. సాలగ్రామం ఉన్న ప్రదేశంలో స్నానం చేసినా, దానం చేసినా, కాశీ క్షేత్రంలో చేసిన గంగాస్నాన దానాల కన్నా, నూరురెట్లు అధికఫలాలు లభిస్తాయి. సాలగ్రామం సాక్షాత్తు నారాయణునిరూపం. సాలగ్రామం ఉన్నచోట నారాయణుడు తప్పక ఉంటాడు. అక్కడ సర్వపుణ్యతీర్థాలతో లక్ష్మీదేవికూడా ఉంటుంది. సాలగ్రామపూజవల్ల బ్రహ్మహత్యాది దోషాలు తొలగిపోతాయి. సాలగ్రామశిలా తీర్థాన్ని సేవిస్తే జన్మమృత్యు జరాభయాలు ఉండవు. సాలగ్రామాన్ని, తులసిని, శంఖాన్ని ఒకచోట ఉంచి పూజిస్తే – శ్రీహరికి చాలా ప్రీతిపాత్రుడు అవుతాడు.



సాలగ్రామఆవిర్భావం

సాలగ్రామ ఆవిర్భావం గురించి ఒక పురాణగాథ ఉంది. పూర్వం ధర్మధ్వజుడు అనే మహారాజుకు రుక్మిణీదేవి అంశతోఒక కుమార్తె జన్మించింది. ఆమెపేరు బృంద. బృంద శ్రీమహావిష్ణువును భర్తగా పొందాలని బదరికాశ్రమంలో బ్రహ్మదేవుణ్ణిగురించి తపస్సు చేసింది. బ్రహ్మదేవుడు ఆమె తపస్సుకు మెచ్చి, ప్రసన్నుడై ప్రత్యక్షమయ్యాడు. అప్పుడు బ్రహ్మదేవుడు బృందతో "శ్రీకృష్ణుని చెలికాడు, శ్రీకృష్ణుని అంశతో జన్మించిన సుదాముడు, గోలోకరాధ శాపంవల్ల భూలోకంలో రాక్షసుడై జన్మించి, నీకు భర్త అవుతాడు. మరు జన్మలో సాక్షాత్తు శ్రీహరియే నీకు భర్త కాగలడు." అని చెప్పాడు.

అంతట గోలోకరాధ శాపంవల్ల సుదాముడు దంభుడు అనే రాక్షసునికి కుమారుడై జన్మించాడు. అతనిపేరు శంఖచూడుడు. శంఖచూడుడు బదరికాశ్రమంలో తపస్సు చేస్తున్న బృందను చూచి, వివాహం చేసుకోవాలని తలచాడు. అనంతరం శంఖచూడ బృందల వివాహం జరిగింది. శంఖచూడుడు రాక్షస స్వభావంతో దేవతలను పీడించసాగాడు. దేవతలు పరమేశ్వరుణ్ణి ఆశ్రయించారు. దేవతల కోరికమీద పరమశివుడు శంఖచూడునితో యుద్ధం చేశాడు. కానీ, అతణ్ణి సంహరించలేక శ్రీకృష్ణుణ్ణి ప్రార్థించాడు– శివుడు. బృందాదేవి


పాతివ్రత్యమే శంఖచూడుణ్ణి కాపాడుతున్నదని గ్రహించిన శ్రీకృష్ణుడు శంఖచూడునిరూపంలో బృంద ఇంటికి వెళ్లాడు. బృంద శ్రీకృష్ణుని చూచి, తనభర్త యుద్ధంలో గెలుపొంది వచ్చాడని తలచి, శంఖచూడుని రూపంలో ఉన్న శ్రీకృష్ణునికి ఆనందంతో సపర్యలు చేస్తుంది. శ్రీకృష్ణుని స్పర్శతో ఆ వచ్చినవాడు తనభర్త కాదని ఆమె గుర్తించింది. పాతివ్రత్యాన్ని కోల్పోయిన బృంద శ్రీకృష్ణుణ్ణి రాయివైపొమ్మని శపించింది. శ్రీకృష్ణుడు బృందను వృక్షం అవుతావని శపించాడు. శివుడు అనంతరం శంఖచూడుణ్ణి సంహరించాడు. శంఖచూడుడు శాపవిముక్తుడై మరల సుదాముడుగా గోలోకం చేరుతాడు.

